# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 23-6-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:246 పేజీలు:6 వెల: రూ.1/-


**నేటి కందం-నేటికి అందం**

**దూనాగిరి సంశోధక్**
**మానిత ఆగ్రేలు నేడు మన మోడీచేన్**
**రాణించెడి గతి భారత**
**వేణికలుగ జలధిలోకి విడువం బడియెన్ !!**

(మన భారత ప్రధాన మంత్రి మోడీ చేతుల మీదుగా మూడు భారత నౌకలు దూనాగిరి, సంశోధక్, ఆగ్రే జల ప్రవేశం చేశాయి. ఇవి తీర రక్షణ కోసం పనిచేస్తాయి. దీని వలన భారత రక్షణ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది. ఎన్నో ఉద్యోగావకాశాలు ఉంటాయి.)



–రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

**ఏడాదికి ఒక్కరోజే**
**ఎంతో గొప్ప ప్రచారం**
**యోగా అభివృద్ధి కొరకు**
**యోచించని ఆచారం.**
**ఫోటోలకు పోజులిచ్చి**
**పోయెటోళ్లే అంతా**
**ఆచరించకుండా ఎవరు**
**ఆరోగ్యం అంటే వింత.**



–వేల్పుల నారాయణ
9440433475

# కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం రేవంత్ భేటీ.. తెలంగాణ అభివృద్ధిపై కీలక చర్చలు



న్యూ ఢిల్లీ, జూన్ 22: కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తోతెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ఈరోజు (సోమవారం) సమావేశం అయ్యారు. ఈ భేటీలో ఇరువురు నేతలు పలు కీలక అంశాలపై చర్చించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించినందుకు రాజ్‌నాథ్ సింగ్‌కు.. సీఎం కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోన్న ప్రాజెక్టుల్లో ఒకటైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సంబంధించి తమ ప్రభుత్వం భూ సేకరణ, యుటిలిటీస్ బదలాయింపు వంటి అంశాల్లో పూర్తి సహకారం అందిస్తామని కేంద్రమంత్రికి తెలిపారు రేవంత్‌రెడ్డి.

దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్నివిధాలా సహాయ, సహకారాలు అందిస్తామని కేంద్రమంత్రికి స్పష్టం చేశారు సీఎం. ఆదిలాబాద్‌లో రానున్న భారతీయ వాయుసేన ఎయిర్‌పోర్ట్‌ను భారీగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్నివిధాలా సహకరిస్తామని వివరించారు. భారత వాయుసేన టెర్మినల్‌తో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించనున్న పౌర విమానయాన శాఖకు చెందిన టెర్మినల్ బిల్డింగ్‌తో పాటుగా కార్గో, ఎమార్వో , హ్యాంగర్ సౌకర్యాలను పెద్దఎత్తున ఏర్పాటు చేసేలా సహకరించాలని కోరారు ముఖ్యమంత్రి.

ఇటీవల పశ్చిమాసియాలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఎయిర్‌లైన్స్ తమ హ్యాంగర్స్‌ను ఏర్పాటు చేసుకోవడానికి అత్యంత అనుకూలమైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను ఆ దిశగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు సీఎం. తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీపంలో డీఆర్డీవో/డీఆర్‌డీఎల్ ఎంచుకున్న ప్రదేశంలో వారికి సంబంధించిన కీలకమైన ప్రాజెక్ట్‌ను త్వరగా మంజూరు చేయాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.

# SIR పేరిట దేశంలో ప్రజాస్వామ్యంపై దాడి: టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

హనుమకొండ, జూన్ 22: SIR పేరిట దేశంలో ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందని.. గతంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. హనుమకొండలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బూత్ లెవెల్ ఏజంట్ల శిక్షణా కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు పాల్గొని ప్రసంగించారు. నాడు ఓటును జోడించే కార్యక్రమం జరిగితే.. నేడు ఓటును తొలగించే కార్యక్రమం జరుగుతోందని ఆరోపించారు. బెంగాల్‌లో ఓట్ చోరీ చేసి అడ్డదారిన బీజేపీ గెలిచిందని దుయ్యబట్టారు. ఓట్లేకాదని.. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ సీటును కూడా దొంగిలించారని విమర్శించారు. ఇక దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ఎక్కడుందని ప్రశ్నించారు.

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా సొంత ఎజెండాతో ముందుకెళున్నారని.. అందుకే వాస్తవాలు చెప్పేందుకు ఇక్కడికి వచ్చామని మహేశ్ తెలిపారు. కేటీఆర్ ఏ ముఖం పెట్టుకుని తిరుగుతున్నారని నిలదీశారు. పదేళ్లలో జరిగిన దోపిడీ, అవినీతి, అక్రమాలు మర్చిపోయారా అని ప్రశ్నించారు. ఆస్తుల కోసం చెల్లిని గెంటేసిన కేటీఆర్ ఇక ప్రజలకు ఏం న్యాయం చేస్తారన్నారు. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ సీటు విషయంలో బీఆర్ఎస్ తీరు బీజేపీకి బలం చేకూర్చేలా ఉందని వ్యాఖ్యానించారు. పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తిస్తున్నామని.. కాస్త ఆలస్యం కావడంలో తమ తప్పిదం ఉందన్నారు. తప్పకుండా అందరికీ న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు గెలుస్తామని మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

# కోచింగ్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

**–ఘటనపై స్పందించిన సీఎం యోగి ఆదిత్యనాథ్**




ఉత్తరప్రదేశ్, జూన్ 22: ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలోని అలీగంజ్ ప్రాంతంలో సోమవారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పురానియా ప్రాంతంలోని ఓ వాణిజ్య భవనంలో కింది అంతస్తులో ఉన్న దుకాణంలో మంటలు చెలరేగి, క్షణాల్లోనే పై అంతస్తుల్లో నిర్వహిస్తున్న కోచింగ్ సెంటర్‌కు వ్యాపించాయి. దీంతో అక్కడ ఉన్న విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మంటలు వేగంగా వ్యాపించడంతో ప్రాణాలను రక్షించుకునేందుకు కొందరు విద్యార్థులు భవనం పై అంతస్తుల నుంచి కిందకు దూకినట్లు స్థానికులు తెలిపారు. మరికొందరు విద్యార్థులు, సిబ్బంది భవనంలో చిక్కుకుపోయినట్లు సమాచారం. ఘటన సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

పలు అగ్నిమాపక వాహనాలతో మంటలను అదుపులోకి తెచ్చేందుకు అధికారులు తీవ్రంగా శ్రమించారు. భవనంలో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకురావడానికి ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ప్రమాదంలో గాయపడిన వారిని సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఘటనపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ (జనీణతి ంటతిబిఎజీనిజీబిష్ట్ర) వెంటనే స్పందించారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. గాయపడిన వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని సూచించారు. అలాగే ప్రమాదానికి గల కారణాలను గుర్తించి నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు**

ప్రాథమిక సమాచారం ప్రకారం భవనం కింది అంతస్తులోని షాపులో మంటలు ప్రారంభమైనట్లు తెలుస్తోంది. అయితే అగ్నిప్రమాదానికి ఖచ్చితమైన కారణం ఇంకా తెలియరాలేదు. షార్ట్‌సర్క్యూట్ లేదా ఇతర సాంకేతిక లోపం కారణమై ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

# ప్రపంచ పర్యాటక రంగంగా భువనగిరి కోట

**–మంత్రి జూపల్లి కృష్ణారావ్ సమీక్ష**



వరంగల్, జూన్ 22:భువనగిరి కోట పర్యాటక అభివృద్ధి పనులను రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కోట క్రింద రోప్‌వే, హోటల్ నిర్మాణం, పార్కింగ్, రెస్ట్‌రూమ్స్, చిల్డ్రన్ ప్లే ఏరియా, రాక్ గార్డెన్ విద్యుత్ దీపాల అలంకరణ వంటి పనులతో పాటు, కొండపైన కోట పునరుద్ధరణ, కేఫేటీరియా, ఇంటర్ప్రిటేషన్ సెంటర్, మెట్ల పునరుద్ధరణ, ఎంట్రన్స్ ప్లాజా, టికెట్ కౌంటర్, వెయిటింగ్ లాంజ్ వంటి అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించారు.

ఈ సందర్భంగా పనుల్లో జరిగిన జాప్యంపై మంత్రి అసహనం వ్యక్తం చేస్తూ, అక్టోబర్ 2 నాటికి అన్ని పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైతే పగలు-రాత్రి పనులు కొనసాగించాలని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. గతంలో పర్యాటక రంగం నిర్లక్ష్యం చెయ్యబడిందని, ప్రస్తుతం నూతన విధానాలతో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. 2047 నాటికి తెలంగాణను అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక, వారసత్వ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడం లక్ష్యమని తెలిపారు. యాదాద్రిలో భువనగిరి కోట, కొలనుపాకలను అనుసంధానిస్తూ సమగ్ర పర్యాటక సర్క్యూట్ అభివృద్ధి జరుగుతోందన్నారు.

ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా భువనగిరి

స్వదేశ్ దర్శన్ స్కీమ్ 2.0 కింద రూ. 56.81 కోట్ల వ్యయంతో భువనగిరి కోటను ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని మంత్రి జూపల్లి తెలిపారు. రోప్‌వే ఏర్పాటు, ఆధునిక సదుపాయాల కల్పనతో పర్యాటకుల సంఖ్య పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రజలు నెలకు కనీసం రెండు సార్లు పర్యాటక ప్రాంతాలను సందర్శించి తెలంగాణ పర్యాటకాన్ని ప్రోత్సహించాలని మంత్రి కోరారు.

**అభివృద్ధి లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి**

**–ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**

అభివృద్ధి పనులను నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. రోప్‌వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ గౌతమి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ భాస్కర్ రావ్, పురావస్తు శాఖ డైరెక్టర్ డా. అర్జున రావు, ఆర్డీఓ కృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మెన్ తంగళ్లపల్లి శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

# ఖతార్ సహజవాయువు కేంద్రం వద్ద పేలుడు.. 54 మందికి గాయాలు, 18 మంది మిస్సింగ్



దోహా, జూన్ 22: ఖతార్‌లోని కీలకమైన సహజవాయువు కేంద్రం వద్ద ఆదివారం రాత్రి భారీ పేలుడుఘటన జరిగింది. ఆ క్షేత్రంపై ఇటీవల ఇరాన్ బాంబు దాడి చేసింది. అయితే ఆ కేంద్రంలో మళ్లీ ఆపరేషన్స్ ప్రారంభించేందుకు వర్కర్లు ప్రయత్నించారు. ఆ సమయంలో పేలుడు జరిగింది. ఆ ప్రమాదంలో 54 మంది గాయపడ్డారు. మరో 18 మంది మిస్సింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. రాస్ లాఫన్ పారిశ్రామిక వాడలో పేలుడు ఘటన సంభవించింది. ఆ ఘటన వల్ల ప్రపంచ ఇంధన మార్కెట్‌లో మరింత ఆందోళనకర వాతావరణం నెలకొన్నది. సహజవాయువుల ఉత్పత్తిలో ప్రపంచవ్యాప్తంగా ఖతార్ నెంబర్ వన్ స్థానంలో ఉన్నది.

హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో.. అయితే ఇటీవల ఖతార్ తన ఉత్పత్తిని తగ్గించుకున్నది. అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చలు ప్రారంభమైన నేపథ్యంలో.. ఎగుమతి టర్మినల్‌ను పునర్ ప్రారంభించాలని ఖతార్ భావించారు. అయితే ఆదివారం పని జరుగుతున్న సమయంలో భారీ పేలుడు ఘటన జరిగింది. ఆ దేశ ప్రభుత్వానికి చెందిన బార్జన్ గ్యాస్ సప్లై కేంద్రంలో ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. ఏ మేరకు నష్టం జరిగిందో ఇంకా అధికారులు అంచనా వేయలేదు.

బార్జన్ ప్లాంట్‌లో ప్రతి రోజు సుమారు 1.4 బిలియన్ క్యూబిక్ ఫీట్ల గ్యాస్‌ను అమ్మే సామర్థ్యం ఉన్నది. రాస్ లాఫన్ పారిశ్రామిక వాడపై గత మార్చిలో ఓ ఇరాన్ మిస్సైల్ ఢీకొన్నది.దీంతో ఖతార్ అక్కడ ఉత్పత్తి ఆపేసింది.

## చికాగోలో కాల్పుల ఘటనలు.. ఏడుగురు మృతి, 38 మందికి గాయాలు

చికాగో, జూన్ 22: అమెరికాలోని చికాగోలో ఇటీవల కాల్పుల ఘటనలు చోటుచేసుకున్నాయి. శుక్రవారం నుంచి జరిగిన ఆ ఘటనల్లో సుమారు ఏడు మంది మృతిచెందారు. మరో 38 మంది గాయపడ్డారు. అమెరికాలో అతిపెద్ద మూడవ నగరమైన చికాగోలు జరుగుతున్న హింసాత్మక ఘటన పట్ల అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. ఆ సిటీలో మిలిటరీని ప్రవేశపెట్టేందుకు ఆయన ఆలోచిస్తున్నట్లు తెలిసింది. సిటీలో సుమారు 20కు పైగా ప్రదేశాల్లో కాల్పుల ఘటనలు జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. ఓ ప్రదేశంలో సామూహిక కాల్పుల ఘటన జరిగింది. అక్కడ 12 మంది గాయపడ్డారు. ఓ ఎస్‌యూవీ నుంచి వ్యక్తి గన్‌తో ఫైరింగ్ చేశాడు. చికాగోలో పరిస్థితి అదుపు తప్పడంతో అక్కడ ఆందోళనకరంగా మారింది. చికాగోను సురక్షిత నగరంగా మార్చగలనని తన ట్రుత్ సోషల్ పోస్టులో ట్రంప్ పేర్కొన్నారు.

# తెలంగాణ హక్కుల పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం: మంత్రి ఉత్తమ్ కుమార్



హైదరాబాద్, జూన్ 22:తెలంగాణ హక్కుల పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈరోజు(సోమవారం) సచివాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్(ఖీఆా), తుంగభద్ర డ్యామ్‌పై చర్చించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్‌లో తెలంగాణకు కేటాయించిన నీటి వాటాపై రాజీ ఉండదని తేల్చిచెప్పారు. ఆర్డీఎస్ ఆయకట్టు రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

తుంగభద్ర జలాల వినియోగంపై తెలంగాణ హక్కులను బలంగా వినిపించాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. తుంగభద్ర నీటి పంపిణీ అంశాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ఎగువ రాష్ట్రాల చర్యల వల్ల తెలంగాణ రైతులకు నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఉత్తమ్ సూచించారు. కృష్ణా పరివాహక ప్రాంత రైతుల సాగు అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ట్రిబ్యునల్, బోర్డులు, అంతర్రాష్ట్ర సమావేశాల్లో తెలంగాణ వాదనను బలంగా వినిపిస్తామని చెప్పారు. చట్టపరమైన, సాంకేతిక, పరిపాలనా అంశాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

తెలంగాణ వాటా నీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకునే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తేల్చిచెప్పారు. రైతుల సాగునీటి అవసరాల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్నైనా తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. తెలంగాణ రైతుల హక్కులు, సాగునీటి భద్రత కోసం ప్రభుత్వం అన్ని వేదికలపై పోరాడుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# సంధ్యా థియేటర్ తొక్కిసలాట కేసు.. జులై 6కు విచారణ వాయిదా



హైదరాబాద్, జూన్ 22: హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన సంధ్యా థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసుపై నాంపల్లి కోర్టులో ఈరోజు (సోమవారం) విచారణ జరిగింది. ఈ కేసులో నిందితులుగా పేర్కొన్న పలువురు కోర్టు ముందు హాజరుకాగా, సినీ నటుడు అల్లు అర్జున్ వ్యక్తిగత కారణాలతో హాజరు కాలేకపోయారని ఆయన తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు.

అనంతరం ఈ కేసు విచారణను జులై 6వ తేదీకి న్యాయమూర్తి వాయిదా వేశారు. ఈ కేసులో అల్లు అర్జున్‌ను A11 నిందితుడిగా పోలీసులు చేర్చిన విషయం తెలిసిందే. ఇవాళ వ్యక్తిగతంగా బన్నీ కోర్టు ముందు హాజరు కావాలని సమన్లు జారీ చేశారు. అయితే అల్లు అర్జున్ గైర్హాజరుకు గల కారణాలను న్యాయస్థానానికి ఆయన తరపు న్యాయవాది వివరించారు.

A1 నుంచి A10 వరకు నిందితులుగా సంధ్యా థియేటర్ యాజమాన్యాన్ని చేర్చగా, మొత్తం 23 మందిపై పోలీసులు ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో 19 మంది నిందితులకు నాంపల్లి కోర్టు ఇప్పటికే సమన్లు జారీ చేసింది. ఈ ఘటన 2024 డిసెంబర్ 4వ తేదీన పుష్ప-2 బెనిఫిట్ షో సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్యా థియేటర్ వద్ద చోటుచేసుకుంది. భారీ సంఖ్యలో అభిమానులు థియేటర్‌కు చేరుకోవడంతో తొక్కిసలాట జరిగింది.

ఈ ఘటనలో రేవతి అనే మహిళ మృతిచెందగా, ఆమె కుమారుడు శ్రీతేజ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ కేసు దర్యాప్తు పూర్తిచేసిన పోలీసులు 23 మందిని నిందితులుగా పేర్కొంటూ నాంపల్లి కోర్టుకు ఛార్జ్‌షీట్ సమర్పించారు. నిందితుల వ్యక్తిగత హాజరు ప్రక్రియ పూర్తైన తర్వాత ఈ కేసులో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టేందుకు నాంపల్లి కోర్టు సిద్ధమవుతోంది. ఈ కేసు సినీ, రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారగా, కోర్టు తదుపరి విచారణలో కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది.

# ఉప్పల్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



రంగారెడ్డి, జూన్ 22: ఉప్పల్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడలో రూ.76లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, స్థానికులు, కాలనీవాసులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఆయన తెలిపారు. నియోజకవర్గ పరిధిలో డ్రైనేజీ సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించిన వెంటనే రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నామని, కాలనీలలో మౌలిక వసతులు కల్పించే లక్ష్యంగా నిధులు కేటాయించి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.

నియోజకవర్గ పరిధిలో చేపట్టిన పనులను కాలనీవాసులు, నాయకులు పరిశీలించి నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చల్లా వెంకటేశ్, చక్రపాణిగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, అనిల్ ముదిరాజ్, నందు, కృష్ణ, జయకృష్ణ, సంపత్, రాజులతో పాటు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# వితంతువులకు గౌరవం, న్యాయం, ఆర్థిక స్వావలంబన కల్పించలేని !

## (23 జూన్ "అంతర్జాతీయ వితంతువుల దినం" సందర్భంగా)

అత్యాధునిక ఏఐ యుగంలో కూడా వితంతువుల పట్ల అమానవీయ వివక్ష కొనసాగుతోంది. వితంతువులు కూడా సాధారణ మానవులే అని, విధి విధించిన శాపంగా వారు తమ భర్తను కోల్పోయి, దుఃఖసాగరం మునిగినప్పటికీ, వారు చేసిన తప్పు ఏమీ లేదని తెలిసినా, ఈ పౌర సమాజం వితంతువును రెండవ శ్రేణి మహిళగా చూడడం, అడుగడుగునా ఆమెను అవమానపరచడం చూస్తున్నాం, నిశ్శబ్దంగా మన పని మనం చేస్తూ పోతున్నాం. మన ఇంట్లో వితంతువు ఉన్నట్లయితే, దురదృష్టవశాత్తు మన అమ్మే అయినా, మనం తనకు తగు ప్రాధాన్యం ఇవ్వకుండా, సంఘ బహిష్కరణ చేసినట్లుగా, పలు శుభకార్యాల్లో తెర వెనుక ఉండమని అవమానపరుస్తూ, నిత్యం తమను సాంప్రదాయాలు లేదా మూఢ విశ్వాసాల పేరున వెధిస్తూనే ఉన్నాం. తన అర్థ భాగమైన జీవిత భాగస్వామిని కోల్పోయి అనంత దుఃఖంలో ఉన్న మహిళను మన ఆచార సాంప్రదాయాలు మరింత వేధించడం, అమానవీయంగా చూడడం జరుగుతుంది.

### అంతర్జాతీయ వితంతువుల దినోత్సవం-2026:

వితంతువుల సమస్యలను గుర్తించడం, పరిష్కారాలు చూపడం, ఆ అభాగ్యుల మానవ హక్కులను పరిరక్షించడం వంటి కార్యక్రమాల నిర్వహణకు ప్రతి ఏటా 23 జూన్ రోజున "అంతర్జాతీయ వితంతువుల దినోత్సవం (ఇంటర్నేషనల్ విడో డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. 2026 అంతర్జాతీయ వితంతువుల దినోత్సవం ఇతివృత్తాలుగా పౌర వ్యవస్థను బలోపేతం చేస్తూ వితంతువుల మానవ హక్కులను సంరక్షించడం నిరంతరం కొనసాగాలి. వితంతువుల సామాజిక గౌరవం, న్యాయం, విద్య, ఆర్థిక భద్రత కల్పించడం మన కనీస కర్తవ్యం అని భావించాలి. దాతృత్వ పరిధులను దాటి వితంతువులకు సహకార సంఘాల ద్వారా ఆర్థిక చేయూత ఇవ్వడానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. జనన మరణాలు ప్రకృతి నియమాలని కళ్లు తెరిచి భర్తలను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో మునిగిపోయిన వితంతువులను ప్రత్యేకంగా గౌరవించకపోయినా వారితో కూడిన సమ్మిళిత జీవన విధానాన్ని మనం పాటించాలి.

### వితంతువుల పట్ల ప్రపంచ స్థాయిలో వివక్ష :

ప్రపంచవ్యాప్తంగా దాదాపు 285 మిలియన్ల వితంతువులు ఉండగా అందులో 1.36 మిలియన్ల బాల్య వితంతువులు ఉన్నారు. నాడు సతీసహగమనం ఓ భయంకర దురాచారం. వైధవ్యం పొందిన దురదృష్టవంతుల్లో అధిక శాతం పేదలు ఉన్నట్లు అంచనా. అధిక సంఖ్యలో వితంతువులు ఆర్థిక సమస్యలు, సామాజిన నిరాదరణలు, అర్థరహిత వివక్షలు, విద్యకు దూరం చేయడం, ఆస్తి హక్కును కల్పించకపోవడం, ఆరోగ్య భద్రత లేకపోవడం, భూమిలో హక్కును లాగేసుకోవడం, శుభకార్యాల్లో నిషేధించడం, తెల్ల చీరలు మాత్రమే కట్టమని నిబంధనలు పెట్టడం, బొట్టు కాటును లాక్కోవడం, చేతి గాజులను నిషేధించడం, దుర్వినియోగాలు ఎదుర్కోవడం, అనువంశిక హక్కులను కల్పించకపోవడం, ఎవరినీ దీవించే హక్కును హరించివేయడం లాంటి అమానవీయ దురాచారాలు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి.

### భారతంలో వితంతువుల పట్ల తీవ్ర వివక్ష:

నాడు చిన్నతనంలోనే పెళ్ళి పీటలెక్కించి, ముక్కుపచ్చలారని వయసులోనే వితంతువులుగా మిగిలిన కథల వెతలు ఎన్నో. మూఢాచార విషవలయంలో చిక్కి విలవిల్లాడుతున్న వితంతువులది ఒడువని దుఃఖం, తీరని వైధవ్య భారం. భారత్‌లో అత్యధికంగా పాండిచ్చేరి, పశ్చిమ బెంగాల్, ఏపీ రాష్ట్రాల్లో ఉండగా అత్యల్పంగా నాగాలాండ్, సిక్కింలలో ఉన్నారు. భారత వితంతువుల పట్ల సాంఘీక, ఆర్థిక, మానసిక వివక్షలు కొనసాగుతూనే ఉన్నాయి. వితంతువుల పట్ల కొన్ని కఠిన నియమనిబంధనలు విధిస్తూ, వితంతువుల జీవితాల్లో కారు చీకట్లు కమ్మడం జరుగుతోంది. సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడానికే కాకుండా పునర్వివాహం చేసుకోవడానికి సమాజం ఒప్పుకోవడం లేదు. వితంతువులు అపవిత్రులు, పౌర సమాజంలో అవమానాలు ఎదుర్కోవడం, దురదృష్టవంతులని ముద్ర వేసింది. వారసత్వ హక్కులను కాలరాస్తూ, తెర వెనుక నిలబడమని శాసిస్తున్నది నేటి అమానవీయ ఆధునిక సమాజం. బొట్టును చెరిపేయడం, తాళిని తెంపేయడం, తాళి మట్టెలను త్యాగం చేయడం, సిగలో పూదండలను నిషేధించడం, నలుగురితో తిరగకుండా నిర్బంధించడం, అందంగా కనబడాన్ని ఓర్వకపోవడం, పసుపును నిషేధించడం, కొత్త దుస్తులు ధరించనివ్వకపోవడం, పండుగలకు దూరంగా పెట్టడం, ఆహార ఆంక్షలు విధించడం, చీదరించుకోవడం, వెట్టిచాకిరీ చేయించుకోవడం, కొన్ని వేళల్లో కోశాలను తొలగించడం, చీకటి గదిలో మగ్గిపోమ్మనడం, చేతి గాజుల్ని పగులగొట్టడం, దీవెనలు ఇవ్వవద్దంటూ శాసించడం లాంటి పలు అశాస్త్రీయ కట్టుబాట్లు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి.

### రాజారామ్ మోహన్ రాయ్, కందుకూరి వీరేశలింగం వారసులం కాలేమా !

వితంతువులకు తమ పిల్లల్ని పెంచే గురుతర బాధ్యతలు ఉంటాయని, కుటుంబానికి పెద్దగా నిలబడి తన సత్తాను చాటుకోవాలని ప్రోత్సహించడం మన కనీస కర్తవ్యం. సామాజిక అవగాహన, ఆర్థిక స్వావలంభన, సామాజిక మద్దత్తులను కల్పిస్తూ వితంతువులను దేశాభివృద్ధిలో భాగం చేద్దాం, ఆమె నుదుట ధైర్యమనే బొట్టుపెట్టి ముందుకు సాగే విధంగా చర్యలు తీసుకుందాం. మనందరం రాజారామ్ మోహన్‌రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, కందుకూరి వీరేశలింగం పంతులు లాంటి వారసులమని రుజువు చేసుకోవడానికి వితంతువు పక్షపాతులుగా వారి జీవితాల్లో వెలుగుల్ని నింపుదాం, ఓ మహాద్భుత మహిళలుగా తీర్చిదిద్దుదాం.

వైధవ్యం ఓ శాపమని, వితంతువుల జీవితాలు నరక ద్వారాలనే నాటి భావనలను చెరిపేసి, విధవలను కూడా సాటి మహిళలుగా చూసుకుందాం, వారి ముఖాల్లో చిరునవ్వుల సింధూరాన్ని అలంకరిద్దాం. వైవిధ్యం పొందిన మహిళకు మేమున్నామనే భరోసా కల్పించడం మన కర్తవ్యం. వితంతువులు ధైర్యాన్ని కూడగట్టుకొని చాదస్తపు దురాచారాలను దూగడపడుతూ, పురుషాధిక్య సమాజంపై ధిక్కార స్వరం వినిపించాలి, అవసరమైతే అపర భద్రకాళులు కావాలి.



-మధుపాళీ
9949700037

# ఘనంగా ఇంటర్ మెరిట్ విద్యార్థులకు సన్మానం..



కరీంనగర్, జూన్ 22: హైదరాబాద్ ఖానా శాంతి వనం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఇంటర్ మెరిట్ విద్యార్థుల సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వరంగల్-హనుమకొండలోని ఇన్‌స్పైర్ జూనియర్ కళాశాల విద్యార్థిని తీగల సాయి శ్రేష్టిత ఇంటర్మీడియట్‌లో 1000 మార్కులకు గాను 997 మార్కులు సాధించి విశేష ప్రతిభ కనబరిచింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రభాకర్ రెడ్డి చేతుల మీదుగా సాయి శ్రేష్టిత గోల్డ్ మెడల్, ప్రశంసా పత్రాన్ని అందుకుంది.

ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, మెరిట్ సాధించిన విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే పట్టుదలతో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల కృషి, అంకితభావానికి గుర్తింపుగా ఇలాంటి పురస్కారాలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.

అనంతరం ఇన్‌స్పైర్ జూనియర్ కళాశాల చైర్మన్ తీగల భరత్ గౌడ్, ప్రిన్సిపాల్ సుంకరి శ్రీరామ్ రెడ్డి, డైరెక్టర్లు తీగల రాజ్‌కుమార్, కోటిచింతల మమత కుమారి, లాడే శివ గోల్డ్ మెడల్, ప్రశంసా పత్రం అందుకున్న విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందించారు.


విద్యార్థిని సాధించిన ఈ ఘనత కళాశాలకు గర్వకారణమని పేర్కొంటూ, భవిష్యత్తులో కూడా ఉన్నత విజయాలు సాధించి కళాశాలకు మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యావేత్తలు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ కానిస్టేబుల్ కుమార్ చొరవ

## -సమయానికి నీట్ పరీక్ష కేంద్రానికి చేరుకున్న విద్యార్థి

కరీంనగర్, జూన్ 22: కరీంనగర్‌లో నిర్వహించిన నీట్-2026 పరీక్షకు హాజరయ్యేందుకు వచ్చిన ఓ విద్యార్థి పరీక్ష కేంద్రానికి ఆలస్యమవుతుండగా, విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ కుమార్ మానవత్వం చాటుకున్నారు. పరీక్ష సమయం సమీపిస్తుండటంతో ఆందోళనకు గురైన విద్యార్థి పరిస్థితిని గమనించిన కానిస్టేబుల్ కుమార్ వెంటనే స్పందించారు. విద్యార్థి పరీక్ష కేంద్రం అయిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సకాలంలో చేరుకునేలా ట్రాఫిక్‌ను సమర్థవంతంగా నియంత్రిస్తూ, అవసరమైన మార్గంలో వేగంగా తరలించి పరీక్ష కేంద్రానికి చేర్చారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్ కుమార్ చూపిన అప్రమత్తత, సేవాభావాన్ని విద్యార్థి కుటుంబ సభ్యులు అభినందించారు. అలాగే కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం కూడా కుమార్‌ను ప్రత్యేకంగా ప్రశంసించారు. ప్రజలకు అవసరమైన సమయంలో సహాయం చేయడం పోలీసుల బాధ్యతలో భాగమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.



# రైల్వేలు.. వ్యవసాయం.. గ్రామీణాభివృద్ధి.. మత్స్య-పశుసంవర్థక రంగాల సంబంధిత వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభోత్సవం..

న్యూ ఢిల్లీ, జూన్ 22: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు 'పశ్చిమబంగ దివస్' (పశ్చిమ బెంగాల్ దినోత్సవం) వేడుకల్లో పాల్గొన్నారు. డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీతో చారిత్రక సంబంధం గల హుగ్లీ జిల్లాలోని తారకేశ్వర్‌లో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది "పశ్చిమ బెంగాల్: వారసత్వం- సామరస్యం-అభివృద్ధి" ఇతివృత్తంగా రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని, సామాజిక ఐక్యతను, ప్రగతిపై ప్రజాకాంక్షలను ప్రతిబింబించేలా వేడుకలు నిర్వహిస్తున్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి అనేక అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన, జాతికి అంకితం చేశారు. రైల్వేలు, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, మత్స్య-పశు సంవర్ధక రంగాలకు సంబంధించిన ఈ ప్రాజెక్టులతో మౌలిక సదుపాయాలు బలోపేతమై జీవనోపాధి మెరుగుపడుతుంది. అలాగే, రైతుల సంక్షేమానికి తోడ్పడుతూ, రాష్ట్రవ్యాప్తంగా సామాజిక-ఆర్థిక అభివృద్ధికి దోహదం చేస్తాయి.

ఈ సందర్భంగా 'ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' పథకం కింద 23వ విడత నిధులను కూడా ప్రధానమంత్రి విడుదల చేశారు. తదనుగుణంగా దేశంలోని 9.44 కోట్ల మందికిపైగా రైతుల బ్యాంకు ఖాతాల్లో -18,880 కోట్లకు పైగా నగదు నేరుగా జమ అయింది.

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ విజయం, కొత్త ప్రభుత్వ ప్రమాణ స్వీకారం అనంతరం రాష్ట్రానికి తొలిసారి వచ్చిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ భారీ బహిరంగ సభనుద్దేశించి ప్రసంగించారు. ముందుగా పశ్చిమ బంగ ఉత్సవాల నేపథ్యంలో రాష్ట్ర, దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ వేడుక నేడు ఆశావాదం, విశ్వాసం పెల్లుబుకుతుండటమే కాకుండా పురోగతిని ప్రతిబింబించే చారిత్రక ఘట్టంగా నిలుస్తున్నదని ఆయన అభివర్ణించారు. "పశ్చిమ బెంగాల్ వృద్ధి, దేశ పురోగమనం దిశగా రాష్ట్రం ఓ కొత్త పయనం ఆరంభించింది. ఉజ్వల భవిష్యత్తుపై పెరుగుతున్న విశ్వాసాన్ని ప్రజలలో కనిపిస్తున్న ఉత్సాహం, రాష్ట్రంలోని సానుకూల వాతావరణం ప్రతిబింబి సున్నాయి" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

"స్వచ్ఛత సే స్వాగత్" (పరిశుభ్రతతో స్వాగతం) కార్యక్రమంలో పాల్గొన్న పౌరులను ప్రధానమంత్రి అభినందించారు. పరిశుభ్రత అనేది దైనందిన జీవితంలోనే కాకుండా సుస్థిర ప్రగతిలోనూ అంతర్భాగం కావాలని స్పష్టం చేశారు. 'పశ్చిమబంగ దివస్' ప్రాధాన్యాన్ని వివరిస్తూ- స్వాతంత్ర్యం, విభజనకు దారితీసిన క్లిష్ట పరిస్థితుల్లో బెంగాల్ సాంస్కృతిక అస్తిత్వం, వారసత్వం సహా దేశంలో తన స్థానం కాపాడుకోవడానికి చేసిన త్యాగాలను ఈ సందర్భం గుర్తుచేస్తుందని శ్రీ మోదీ అన్నారు. బెంగాల్ ప్రజల ప్రయోజనాలు, ఆకాంక్షల పరిరక్షణకు కృషి చేసిన దార్శనికులు, సామాజిక నాయకులు, పండితులు, ప్రముఖులకు ఆయన నివాళి అర్పించారు.

దేశ విభజన వేళ బెంగాల్‌లోని కొంత భాగం భారత్‌లోనే ఉండేవిధంగా చూడటంలో కీలక పాత్ర పోషించిన డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ సేవలను ప్రధానమంత్రి గుర్తుచేసుకున్నారు. ఆ చారిత్రక ఉద్యమంలో పాల్గొన్న మేధావులు, పండితులు, సంఘ సంస్కర్తలు, సామాజిక నాయకులు, పారిశ్రామికవేత్తల మద్దతును కూడా ఆయన స్మరించుకున్నారు. "రవీంద్రనాథ్ టాగోర్, బంకించంద్ర చటోపాధ్యాయ, స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్, ఈశ్వర్ చంద్ర విద్యాసాగర్ వంటి మహనీయులు రూపుదిద్దిన పశ్చిమ బెంగాల్ సుసంపన్న వారసత్వం దేశానికి నేడు కూడా స్ఫూర్తినిస్తూనే ఉంది. భవిష్యత్తరాలకు కొత్త అవకాశాలను సృష్టిస్తూ, ఈ వారసత్వాన్ని పరిరక్షించడంతోపాటు ఘనంగా చాటాల్సిన అవసరం ఎంతయినా ఉంది" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

రాష్ట్రంలో దశాబ్దాల నుంచి పేరుకుపోయిన సవాళ్లను కొత్త ప్రభుత్వం పరిష్కరించడం ప్రారంభించిందని శ్రీ మోదీ అన్నారు. మరోవైపు పురోగమన వేగం పెంచడానికి కృషి చేస్తున్నదని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక సామర్థ్యాన్ని సంపూర్ణంగా సద్వినియోగం చేసుకునేందుకు సత్వర నిర్ణయాలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. దీర్ఘకాలం నుంచి స్తంభించిన ప్రాజెక్టులను నేడు పునరుద్ధరిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా "ఇవాళ్టి కార్యక్రమంలో రైల్వేలు, రహదారులు, వ్యవసాయం, మత్స్య రంగాలకు సంబంధించిన రూ.వందల కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశాం. ఈ కార్యక్రమాలు గ్రామీణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంతోపాటు అనుసంధానాన్ని మెరుగుపరుస్తాయి. స్థానిక ఆర్థిక వ్యవస్థలకు ఊతమిస్తూ ఉపాధి, అభివృద్ధి దిశగా కొత్త అవకాశాలను సృష్టిస్తాయి" అని శ్రీ మోదీ విశదీకరించారు.

దేశవ్యాప్తంగా 9 కోట్ల మందికిపైగా రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా 'పీఎం కిసాన్' పథకం 23వ విడత విడుదల-జమ గురించి ప్రధానమంత్రి మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. లబ్ధి పొందిన రైతు కుటుంబాలన్నింటికీ ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర చరిత్ర నుంచి స్ఫూర్తి పొందాలని పౌరులకు పిలుపు నిస్తూ- పశ్చిమ బెంగాల్‌కు అపార సాంస్కృతిక, మేధా, ఆర్థిక బలం ఉందని, భారత ప్రగతి ప్రస్థానంలో మరోసారి అగ్రగామిగా నిలవగలదని ప్రధానమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. "పశ్చిమ బెంగాల్ దినోత్సవం కేవలం చరిత్రను స్మరించుకునేదిగా కాకుండా అభివృద్ధి, పురోగమనం, జాతీయ ఐక్యతకు సరికొత్త నిబద్ధతగానూ ఉండాలి. మరింత శక్తియుత, సుసంపన్న భారత్‌ను తీర్చిదిద్దడంలో రాష్ట్ర ప్రజలు ప్రధాన పాత్ర పోషిస్తారు" అని శ్రీ మోదీ ఉద్ఘాటించారు.

ఎన్నికల సమయంలో పశ్చిమ బెంగాల్ ప్రజలకిచ్చిన హామీలను నిర్దేశిత వ్యవధిలోగా నెరవేరుస్తామని ప్రధానమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో అర్హతగల ప్రతి పేద కుటుంబానికీ ఇకపై ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకం ద్వారా ఉచిత ఆరోగ్యం సంరక్షణ లభిస్తుందని ఆయన ప్రకటించారు. అన్నపూర్ణ పథకం ప్రారంభం, జల్ జీవన్ మిషన్ ద్వారా సురక్షిత తాగునీటి సరఫరా విస్తరణ, ప్రభుత్వ ఉద్యోగాల వయోపరిమితిలో సడలింపు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం వగైరాలను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. "ఏళ్ల తరబడి స్తంభించిన సంక్షేమ పథకాలను నేడు ప్రజా కార్యక్రమ శిబిరాల ద్వారా నేరుగా లబ్ధిదారులకు చేరువ చేస్తున్నాం. దీనివల్ల పారదర్శకత, సామర్థ్యం మెరుగుపడి, దళారీ వ్యవస్థ అంతమవుతుంది" అని శ్రీ మోదీ ప్రకటించారు.

మౌలిక సదుపాయాల కల్పనను ప్రస్తావిస్తూ- దీర్ఘకాలం నుంచీ మూలపడిన అనేక ప్రాజెక్టులు ఇప్పుడు వేగం పుంజుకున్నాయని శ్రీ మోదీ పేర్కొన్నారు. వీటిలో చింగ్రిఘటా క్రాసింగ్ వద్ద కోల్‌కతా మెట్రో ఆరెంజ్ లైన్ పనులు పూర్తి కావడం, హౌరాలో కొత్త డివిజనల్ రైల్వే ఆసుపత్రికి శంకుస్థాపన, పూరబ్ మేదినీపూర్‌లో రోడ్ ఓవర్‌బ్రిడ్జిలు, సంక్రయిల్-సంత్రాగచ్చి రైలు మార్గం ప్రాజెక్ట్ వంటివి ఉన్నాయి. రైతుల సంక్షేమంపై దృష్టి సారిస్తూ, పంట నష్టాల నుంచి వారికి ఆర్థికంగా రక్షణ కల్పించే 'ప్రధాన మంత్రి పంటల బీమా పథకం' పశ్చిమ బెంగాల్‌లో ప్రారంభం కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. రైతు రిజిస్ట్రీలు, డిజిటల్ భూ రికార్డులు, వ్యవసాయ సేవలు, ప్రయోజనాల పంపిణీలో మెరుగుదల దిశగా 'డిజిటల్ అగ్రికల్చర్ మిషన్'తో రాష్ట్రాన్ని సంధానిస్తున్నామని ఆయన ప్రకటించారు. "పీఎం ధన్‌ధాన్య కృషి యోజన కింద రాష్ట్రంలోని పురూలియా, అలీపుర్‌దువార్, ఝార్‌గ్రామ్, డార్జిలింగ్ జిల్లాల్లో వ్యవసాయ ఉత్పాదకత పెంపు, నిల్వ మౌలిక సదుపాయాల బలోపేతం, రుణ లభ్యతను మెరుగుదలకు ప్రత్యేకంగా చేయూతనిస్తాం" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో మత్స్య రంగం ప్రాధాన్యాన్ని ప్రస్తావిస్తూ- దక్షిణ 24 పరగణాలలో ఫ్రేజర్ గంజ్ ఫిషింగ్ హార్బర్ విస్తరణ, బీర్భుమ్‌లో ఆధునిక చేపల మార్కెట్ ఏర్పాటును ప్రధాన మంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. ఇవి జీవనోపాధిని పెంచి, మత్స్య రంగాన్ని బలోపేతం చేస్తాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ 'ఖేత్ బచావో అభియాన్'లో పాలుపంచుకుంటూ భూసారాన్ని పెంచి, రసాయన ఎరువుల పరాధీనతను తగ్గిస్తూ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని దేశవ్యాప్తంగా గల రైతులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

దేశం 2047 నాటికి వికసిత భారత్‌గా రూపొందాలన్న ప్రభుత్వ దార్శనికతను పునరుద్ఘాటిస్తూ- ఈ లక్ష్య సాధనలో 'పూర్వోదయ' పథకం కింద తూర్పు భారతం అభివృద్ధి కీలకం కాగలదని ప్రధానమంత్రి అన్నారు. తద్వారా ప్రాంతీయ, జాతీయ వృద్ధికి తోడ్పాటులో పశ్చిమ బెంగాల్ ప్రధాన పాత్ర పోషిస్తుందని స్పష్టం చేశారు. "సుస్థిర ప్రగతి, శాంతి, సామాజిక సామరస్యం, సాంస్కృతిక పరిరక్షణ సహితమైనదిగా ఉండాలి. సామూహిక పురోగమనం దిశగా భుజం కలిపి పనిచేస్తూ బెంగాల్ సుసంపన్న సాంస్కృతిక వారసత్వాన్ని, సామాజిక చట్రాన్ని బలోపేతం చేయాలి" అని శ్రీ మోదీ ఉద్ఘాటించారు.

చివరగా- రాష్ట్ర ప్రజలంతా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాలు పంచుకోవాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. స్వామి వివేకానంద, శ్రీ అరబిందోల జన్మభూమి అయిన ఈ రాష్ట్రం యోగా, ఆరోగ్యం, మానవాళి ఐక్యత సందేశంతో ప్రపంచానికి మరోసారి స్ఫూర్తినిస్తుందని విశ్వాసం వ్యక్తం చేస్తూ ఆయన తన ప్రసంగం ముగించారు.

# మొబైల్ ఫోన్ నిషేధం.. విద్యార్థి సంఘాల ఆగ్రహం..

ఆదిలాబాద్, జూన్ 22 : బాసర ట్రిపుల్ ఐటీ యూనివర్సిటీ మెస్ లో మొబైల్ ఫోన్ల వినియోగాన్ని నిషేధిస్తూ యూనివర్శిటి అధికారులు సర్క్యులర్ జారీ చేశారు. ఈ సర్క్యులర్ జారీ పై ఇటు విద్యార్థి సంఘాలు, విద్యార్థుల ఖండిస్తున్నాయి. విద్యార్థులకు అందించే అల్పాహారం, భోజనం నాణ్యమైన పరిశుభ్రంగా ఉండాలని విద్యార్థులు కోరుతున్నారు.

గత కొంత కాలంగా మెస్‌లలో అపరిశుభ్ర పరిస్థితులకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ ఘటనలు విశ్వవిద్యాలయ ప్రతిష్ఠను దెబ్బతీయడమే కాకుండా, విద్యార్థుల ఆరోగ్య భద్రత పై కూడా తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తాయి. ఇలాంటి సమస్యలు వెలుగులోకి వచ్చినప్పుడు వాటి మూల కారణాలను గుర్తించి పరిష్కరించడం యూనివర్శిటి అధికారుల బాధ్యత. కానీ సమస్యలను పరిష్కరించకుండా వాటిని చిత్రీకరించే ఫోన్ ల పై ఆంక్షలు విధించడం సరైన విధానం కాదని విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. మెస్ లలోని డైనింగ్ హాల్‌లో మొబైల్ ఫోన్ నిషేధం వల్ల బొద్దింకలు మాయమవుతాయా అని ప్రశ్నించారు. ముందుగా యూనివర్శిటి భోజనశాలలో పరిశుభ్రత లేని మెస్ ల పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సమస్యను చూపించిన విద్యార్థులను లక్ష్యంగా చేయడం పై విమర్శలు వస్తున్నాయి. మెస్ లలోని సమస్యలను పరిష్కరించి విద్యార్థుల మనసులను గెలుచుకోవాలని ఆయా విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. మొబైల్ ఫోన్లను నిషేధించడం కంటే, విద్యార్థులు భయపడకుండా తమ సమస్యలను తెలియజేయగల వాతావరణాన్ని సృష్టించి వాటిని పరిష్కరించేలా అధికారులు పని చేయాలని, వెంటనే జారీ చేసిన సర్క్యులర్ ను ఎత్తివేయాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

# దరఖాస్తుల పరిష్కారంలో జాప్యానికి తావివ్వొద్దు

## –పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



కరీంనగర్, జూన్ 22: ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పరిపాలన అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లా అధికారులను ఆదేశించారు.

సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్లు జే. అరుణ శ్రీ, కొప్పుల వెంకట్ రెడ్డితో కలిసి జిల్లా అధికారులతో పరిపాలనా అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదులు, వినతిపత్రాల పరిష్కారంపై అన్ని శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకూడదని, ప్రతి దరఖాస్తును నిర్దేశిత గడువులో పరిష్కరించి తప్పని సరిగా సమాధానం అందించాలని అన్నారు.

పారదర్శకత, జవాబుదారీతనం ప్రతి అధికారిలో ఉండాలని, ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. సమాచార హక్కు చట్టం కింద వచ్చే దరఖాస్తులకు కూడా నిర్ణీత సమయంలో సమాధానాలు అందించాలని సూచించారు. జిల్లా పరిపాలనలోని అధికా రులు, సిబ్బంది విధులకు సకా లంలో హాజరు కావాలని, అన్ని శాఖలు తమ పరిధిలోని ఫీల్డ్ సిబ్బంది హాజరు, పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సేవలు సమర్థవంతంగా ప్రజలకు అందేలా శాఖాధిపతులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

కొన్ని శాఖల్లో ఫైళ్ల పరిష్కారంలో అనవసర జాప్యం జరుగుతోందన్న ఫిర్యాదులు వస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రతి శాఖాధికారి తమ శాఖలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను క్రమం తప్పకుండా సమీక్షించి, ఉద్దేశపూర్వక జాప్యాలను గుర్తించి వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు.

కొంతమంది ఫీల్డ్ సిబ్బంది లంచాలు డిమాండ్ చేస్తున్నారన్న ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయని, అవినీతిని ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా అధికారులు, సిబ్బంది నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని సూచించారు.

త్వరలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని శాఖలు తమకు సంబంధించిన వివరాలను సంక్షిప్తంగా, నాణ్యమైన సమాచారంగా సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, ఆర్డీవోలు గంగయ్య, సురేష్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# అమ్మవారి నిత్య అన్నదానానికి రూ.10 లక్షల విరాళం

## –ఆలయ చైర్మన్ బొర్రా గాంధీకి చెక్కు అందజేత



విజయవాడజూన్ 22: విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి నిత్య అన్నదాన కార్యక్రమానికి భక్తులు మరోసారి ఉదారత చాటుకున్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కృష్ణయపాలెం గ్రామానికి చెందిన వై. జయశంకర్ కిషోర్ బాబు, మహాలక్ష్మి దంపతులు అమ్మవారిపై ఉన్న అపార భక్తిశ్రద్ధలతో నిత్య అన్నదాన విభాగానికి రూ. 10,00,000 (పది లక్షల రూపాయలు) విరాళంగా సమర్పించారు. ఈ విరాళాన్ని ఆలయ చైర్మన్ శ్రీ బొర్రా రాధాకృష్ణ (గాంధీ) సమక్షంలో భక్తిపూర్వకంగా అందజేశారు. ఈ సందర్భంగా దంపతులు అమ్మవారి ఆశీస్సులతో సమాజ సేవలో భాగంగా అన్నదాన కార్యక్రమానికి తమ వంతు సహకారం అందించడం ఆనందంగా ఉందని తెలిపారు. వీరికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేయగా, వేద ఆశీర్వచనం అనంతరం చైర్మన్ బొర్రాగాంధీ అమ్మవారి చిత్రపటం రసీదు, ప్రసాదాలను అందజేశారు.

# ప్రపంచవ్యాప్తంగా 2,500 ప్రాంతాల్లో యోగా వేడుకలు:

## రంగంలోకి దిగిన 210కి పైగా భారతీయ రాయబార కార్యాలయాలు

న్యూఢిల్లీ, జూన్ 22:భారత్ 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని . ఈ జాతీయ స్థాయి ప్రధాన వేడుక పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతా చారిత్రాత్మక రెడ్ రోడ్ వేదికగా జరగింది. ఆరో గ్యం, సంక్షేమం కోసం యోగాను ఒక ప్రపంచ వ్యాప్త ఉద్యమంగా మార్చే ప్రయత్నాలలో భాగంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ స్వయంగా ఈ వేడుకలకు నాయకత్వం వహిస్తూ దేశ ప్రజలతో కలిసి 'కామన్ యోగా ప్రోటోకాల్‌ను అభ్యసిం చనున్నారు.

రెడ్ రోడ్‌లో జరిగే ఈ జాతీయ స్థాయి వేడుక ఉదయం 5:00 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమంలో వేలాది మంది యోగాభిమానులు ప్రత్యక్షంగా పాల్గొననుండగా.. దేశ, విదేశాల నుంచి కోట్లాది మంది పౌరులు వర్చువల్ పద్ధతిలో భాగస్వాములు కానున్నారు. ఆరోగ్యం, సామరస్యం, సామూహిక సంక్షేమాన్ని పెంపొందించడంలో యోగాకు పెరుగుతున్న పాత్రను ఈ కార్యక్రమం పునరుద్ఘాటిస్తుంది.ఈ సంవత్సరం అంతర్జాతీయ యోగా దినోత్సవం 2026 ఇతివృత్తం "ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా"... ఆరోగ్యకరమైన, చురు కైన, గౌరవప్రదమైన వృద్ధాప్యం కోసం యోగాను జీవితకాల సాధనగా అలవర్చుకోవడంలోని ప్రాధా న్యతను తెలియజేస్తుంది. శారీరక శక్తిని, మానసిక దృఢత్వాన్ని, భావోద్వేగ సమతుల్యతను పెంపొం దించే ఒక నివారణ ఆరోగ్య సంరక్షణ విధానంగా యోగా సహకారాన్ని ఇది స్పష్టం చేస్తుంది.ప్రధాన వేడుకలకు ముందే ఆయుష్ మంత్రిత్వ శాఖకు చెందిన యోగా సంగమం వేదిక భారీ మైలురాయిని అధిగమించింది. ఇందులో వివిధ సంస్థల నమోదు సంఖ్య 6 లక్షల మార్కును దాటి, నిరంతరం క్రమంగా పెరుగుతోంది. ఈ అద్భు తమైన స్పందన యోగాను ఒక నిజమైన ప్రజా ఉద్యమంగా మార్చడంలో వివిధ సంస్థలు, సంఘా లు, పౌరులకు ఉన్న ఉత్సాహాన్ని ప్రతిబింబిస్తోంది.

అంతర్జాతీయ యోగా దినోత్సవం 2026లో ఈసారి విశేషమైన ప్రపంచవ్యాప్త భాగస్వామ్యం కనిపిస్తోంది. ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ (ఐసీసీఆర్) సమన్వయ ప్రయత్నాల ద్వారా విదేశాల్లో ఉన్న 210కి పైగా భారతీయ రాయబార కార్యాలయాలు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 2,500 ప్రాంతాల్లో యోగా వేడుకలను నిర్వహిస్తున్నాయి. భారతదేశ పురాతన జ్ఞానంలో వేళ్లు ఊనుకున్న యోగా.. సమగ్ర సంక్షేమం కోసం ఎలా ఒక అంతర్జాతీయ ఉద్యమంగా ఎదిగిందో ఇది నిరూపిస్తోంది.అంతర్జాతీయ యోగా దినోత్సవం 2026 వేడు కలకు సాంస్కృతిక కోణాన్ని అందిస్తూ.. భారతీయ పురావస్తు శాఖ సహకారంతో కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా 100 ప్రముఖ ప్రదేశాల్లో ప్రత్యేక యోగా వేడుకలను నిర్వహిస్తోంది. ఇది దేశపు గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని, చారిత్రాత్మక కట్టడాలను, యోగా సంప్రదాయాలను ఒకే తాటిపైకి తెస్తుంది.

ఈ కార్యక్రమంలో భాగం గా న్యూఢిల్లీలోని ఎర్రకోట, ఉత్తరాఖండ్‌లోని హరి ద్వార్, ఒడిశాలోని కోణార్క్, కర్ణాటకలోని హంపి, తమిళనాడులోని మహాబలిపురం, మహారాష్ట్రలోని ముంబై, బీహార్‌లోని నలంద, గుజరాత్‌లోని అహ్మదాబాద్, ఉత్తరప్రదేశ్‌లోని సార్నాథ్, లడఖ్‌లోని లేహ్, తెలంగాణలోని హైదరాబాద్,అస్సాంలోని సిల్చార్ సహా 12 ప్రధాన ప్రముఖ ప్రాంతాలలో అతిపెద్ద వేడుకలు జరగనున్నాయి.

# "గిరిజన బాలలకు మెరుగైన విద్యా సదుపాయాల దిశగా దేశంలో సుమారు 500 ఏకలవ్య ఆదర్శ ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేశాం": ప్రధానమంత్రి

న్యూ ఢిల్లీ, జూన్ 22: రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు ఒడిషాలోని మయూర్‌భంజ్ జిల్లాలోగల పహాడ్‌పూర్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పవిత్ర 'సంథాలీ', 'హో' గిరిజన తెగల పవిత్ర వృక్షదేవతారాధ్య (జహేరా) ప్రాంతాలలో ప్రార్థనలు చేశారు. అలాగే, అక్కడి నైపుణ్యాభివృద్ధి కేంద్రం, పహాడ్‌పూర్ పాఠశాలను సందర్శించారు. ఒడిషాలో బీజేపీ ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో "వికాస్ రా ధార–ఒడిషా సారా" (ఒడిషా రాష్ట్రమంతటా అభివృద్ధి ప్రవంతి) ఇతివృత్తంగా మయూర్‌భంజ్ జిల్లాలోని రాయ్‌రంగపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వారిద్దరూ పాల్గొన్నారు. ఇందులో భాగంగా శ్రీ మోదీ –47,600 కోట్లకు పైగా విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించడంతోపాటు కొన్నిటికి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల ముగిసిన 'రాజా' వేడుకతోపాటు త్వరలో నిర్వహించనున్న మయూర్‌భంజ్ ప్రసిద్ధ బారిపద రథయాత్ర సహా పూరీ జగన్నాథ పవిత్ర రథయాత్ర ఏర్పాట్లతో రాష్ట్రంలో ఉత్సవ వాతావరణంలో మునిగిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజలకు అభినందనలు తెలుపుతూ– "ద్వంద్వ చోదక ప్రభుత్వం రాష్ట్ర ప్రగతి పయనాన్ని వేగిరపరుస్తోంది. సంక్షేమ పథకాలు, పెట్టుబడులు, పారిశ్రామిక వృద్ధి, ఉపాధి అవకాశాల సౌలభ్యంతో సామాన్యుల జీవితాల్లో వెలుగులు పూస్తున్నాయి" అని శ్రీ మోదీ అన్నారు.

సంతాలీ భాష కోసం 'ఓల్ చికి' లిపిని సృష్టించిన పండిట్ రఘునాథ్ ముర్ము, డాక్టర్ దమయంతి బెస్రా, శ్రీ చరణ్ హెంబ్రామ్ వంటి రాష్ట్ర ప్రముఖులకు ప్రధానమంత్రి నివాళి అర్పించారు. భారత రాజ్యాంగాన్ని సంతాలీ భాషలోకి అనువదించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆ భాష, సంస్కృతులకు ప్రోత్సాహం, పరిరక్షణ దిశగా కేంద్ర ప్రభుత్వ కృషిని ఆయన ప్రస్తావించారు.

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం సందర్భంగా ప్రధానమంత్రి ఆమెకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మయూర్‌భంజ్ గడ్డమీది నుంచి దేశ అత్యున్నత రాజ్యాంగ పదవికి ఆమె ఎదిగిన తీరు ఒడిషాతో పాటు దేశానికీ ఎంతో గర్వకారణమని శ్రీ మోదీ అభివర్ణించారు. ప్రజాసేవలో ఆమె అంకితభావం, వినమ్రత, దేశ ప్రగతిపై ఆమె కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. రాష్ట్రపతితో కలిసి పహాడ్‌పూర్ సందర్శించడాన్ని ప్రస్తావిస్తూ– ఆమె మార్గదర్శకత్వంలో ఏర్పాటైన విద్యా సంస్థలలోని విద్యార్థులతో ముచ్చటించడం తనకెంతో ఆనందాన్నిచ్చిందని ప్రధానమంత్రి అన్నారు. "రాష్ట్రపతి ముర్ము స్ఫూర్తిదాయక ఉనికి ఇక్కడి బాలల్లో... ముఖ్యంగా గిరిజన, అట్టడుగు, వెనుకబడిన వర్గాలవారిలో ఆత్మవిశ్వాసం నింపుతూ, ఉన్నత లక్ష్యాల వైపు వారిని ప్రోత్సహిస్తోంది" అని శ్రీ మోదీ చెప్పారు.

ఈ సందర్భంగా ప్రధానమంత్రి ఓ కీలక ప్రకటన చేశారు. ఈ మేరకు పహాడ్‌పూర్ గ్రామాన్ని త్వరలోనే సౌరశక్తి గ్రామంగా రూపొందిస్తామని, తద్వారా ఇంటింటా వెలుగులు నిండటం సహా సౌర విద్యుదుత్పాదన కూడా ప్రారంభం కాగలదని చెప్పారు. ఒడిషాలోని కోణార్క్ సూర్య దేవాలయం స్ఫూర్తితో దేశానికే ఆదర్శ సౌరశక్తి గ్రామంగా పహాడ్‌పూర్ ఎదుగుతుందని ఆయన విశ్వాసం వెలిబుచ్చారు. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ నాయకత్వంలోని ఒడిషా ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ– రాష్ట్రం అన్ని రంగాల్లోనూ వేగంగా పురోగమిస్తోందని ప్రధానమంత్రి అన్నారు. "దేశ సమగ్రాభివృద్ధి కోసం తూర్పు భారతం అభివృద్ధి" కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. ఈ మేరకు "పూర్వోదయ" విధానం కింద తూర్పుతీర రాష్ట్రాల అపార సామర్థ్యాన్ని సద్వినియోగం చేస్తుకుంటున్నామని పేర్కొన్నారు. రైల్వే మౌలిక సదుపాయాలు, జాతీయ రహదారులు, ఆర్థిక కారిడార్లు, ఓడరేవులు, ఇంధన రంగం, సెమీకండక్టర్లు, కాలుష్య రహిత ఇంధనం, ఆధునిక పరిశ్రమలలో భారీ పెట్టుబడులు తదితరాలతో ఈ సామర్థ్యాల సంపూర్ణ వినియోగానికి కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు సమష్టిగా కృషి చేస్తున్నాయని శ్రీ మోదీ స్పష్టం చేశారు. ఈ మేరకు "సుమారు ?47,000 కోట్ల విలువైన పరిణామాత్మక ప్రాజెక్టులతో రాష్ట్ర ప్రజలకు రవాణా అనుసంధానం, ప్రజా సేవలు, ఆర్థిక అవకాశాలు, జీవన ప్రమాణాలు గణనీయంగా మెరుగవుతాయి. తూర్పు భారతంలో వృద్ధి, సౌభాగ్యానికి ఒడిషా ముఖద్వారంగా ఎదుగుతోంది. ఈ క్రమంలో అభివృద్ధి చెందిన దేశంగా భారత్ ప్రస్థానంలో కీలక పాత్ర పోషిస్తుంది" అని శ్రీ మోదీ అన్నారు.

ఒడిషాలోని అపార వనరులను దేశాభివృద్ధి, సౌభాగ్యం వైపు అవకాశాలుగా ప్రభుత్వం మలుస్తున్నదని ప్రధానమంత్రి చెప్పారు.

రాష్ట్రవ్యాప్తంగా భారీ పెట్టుబడులను ఆకర్షించడం సహా పారిశ్రామికాభివృద్ధికి ప్రోత్సాహం లక్ష్యంగా చేపట్టిన 'ఉత్కర్ష్ ఒడిషా' వంటి కార్యక్రమాల గురించి ఆయన ప్రస్తావించారు. "ఈ కార్యక్రమం కింద ఇప్పటికే రాష్ట్రానికి దాదాపు –20 లక్షల కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయి. అలాగే –3.5 లక్షల కోట్లకు పైగా విలువైన అనేక భారీ ప్రాజెక్టులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. రాష్ట్ర సమగ్రాభివృద్ధిపై దృష్టి సారిస్తూ పరిశ్రమలకు అనువైన వాతావరణ సృష్టికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

విద్యుత్తు రంగంలో –6,000 కోట్లకు పైగా పెట్టుబడులు పెడుతున్నామని, 'సమృద్ధ సిటీ' పథకం కింద పట్టణాభివృద్ధిని వేగిరపరుస్తున్నామని ప్రధానమంత్రి తెలిపారు. ఈ కార్యక్రమాలు భవిష్యత్తులో గణనీయ ఫలితాలివ్వగలవని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వ సామర్థ్యాన్ని ప్రస్తావిస్తూ– పాలనను నేరుగా ప్రజల ముంగిటకు చేరుస్తూ సమస్యల పరిష్కారం కోసం వారు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేసే దురవస్థ లేకుండా చేస్తున్నామని శ్రీ మోదీ అన్నారు. ఫలితంగా రాష్ట్రంలో యువత, మహిళలు, రైతులు, సామాన్యుల ఆకాంక్షలు నెరవేరుతున్నాయని చెప్పారు.

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పలు కీలక సంక్షేమ కార్యక్రమాలను శ్రీ మోదీ ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ మేరకు వరి కొనుగోలులో క్వింటాల్‌కు –3,100 వంతున రైతుకు గిట్టుబాటు ధర ఇస్తున్నామని చెప్పారు. అలాగే, 'సుభద్ర యోజన' కింద కోటి మందికి పైగా మహిళలకు ఆర్థిక సహాయం, ఆరోగ్య సంరక్షణ సదుపాయం విస్తరణ కింద ఆయుష్మాన్ భారత్ పథకం అమలు చేస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా మాధో సింగ్ హాత్ ఖర్చా యోజన ద్వారా గిరిజన విద్యార్థులకు మద్దతు, భక్తుల మనోభావాల మేరకు శ్రీ జగన్నాథ ఆలయం నాలుగు ద్వారాలను తిరిగి తెరవడం వంటి చర్యలు కూడా చేపట్టామన్నారు. ఈ ప్రాంతమంతటా ఇటీవల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించడాన్ని ఆయన ప్రశంసించారు. "పరిశుభ్రతతో సాదర స్వాగతం" పేరిట చేపట్టిన ఈ కార్యక్రమం సత్ఫలితాలిచ్చిందని ఆయన పేర్కొన్నారు.

గిరిజన సంక్షేమంపై మాట్లాడుతూ– గిరిజన ప్రాంతాలతో తనకుగల సుదీర్ఘ అనుబంధాన్ని ప్రధానమంత్రి గుర్తుచేసుకున్నారు. గిరిజన తెగల సేవలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏళ్ల తరబడి చేసిన కృషిని ఆయన కొనియాడారు. "గిరిజన ప్రాంతాలు చారిత్రకంగా ప్రాథమిక సేవలు, కనీస సదుపాయాలకు నోచుకోలేదు. అందుకే, గిరిజనం పురోగమనానికి మా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది. గిరిజన గ్రామాల్లో జీవన స్థితిగతుల మెరుగుకు 'ధర్తీ ఆబా జన జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్' కింద ఆరోగ్యం, విద్య, రహదారులు, గృహనిర్మాణ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి" అని శ్రీ మోదీ వివరించారు.

రాష్ట్రపతి ముర్ముతో చర్చల ఫలితంగానే 'పీఎం జన్మాన్ మిషన్' రూపుదిద్దుకున్నదని గుర్తుచేశారు. ఇది ప్రత్యేకించి గిరిజనులలోని బలహీన వర్గాల (పీవీటీజీల) అభ్యున్నతి లక్ష్యంగా అమలవుతున్నదని చెప్పారు. తద్వారా అత్యంత అట్టడుగునగల గిరిజనులకూ ప్రభుత్వ సేవలు ఇంటి ముంగిటకే చేరుతున్నాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

గిరిజన యువతకు విద్య, ఉపాధి అవకాశాల ప్రాధాన్యాన్ని వివరిస్తూ– దేశవ్యాప్తంగా ఇప్పటికే దాదాపు 500 ఏకలవ్య ఆదర్శ ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటయ్యాయని చెప్పారు. మరో 750 దాకా పాఠశాలల నిర్మాణానికి ఆమోదం తెలిపామని పేర్కొన్నారు. ప్రీ–మెట్రిక్, పోస్ట్–మెట్రిక్ స్థాయులలో 1.5 కోట్ల మందికి పైగా గిరిజన విద్యార్థులు రూ.వందల కోట్ల విలువైన ఉపకార వేతనం అందుకుంటున్నారని తెలిపారు. మయూర్‌భంజ్ జిల్లాలో అదనంగా మరొక జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటుకు ఆమోదం తెలిపినట్లు శ్రీ మోదీ ప్రకటించారు.

గిరిజనం ఆరోగ్య సంరక్షణ సవాళ్లపై ప్రసంగిస్తూ– మారుమూల ప్రాంతాల్లో తీవ్ర ఆందోళనకు దారితీస్తున్న 'సికిల్ సెల్ అనీమియా' వంటి వ్యాధుల నిర్మూలకు చేపట్టిన చర్యలను వివరించారు. "ఈ వ్యాధి నిర్మూలనలో భాగంగా ప్రభుత్వం దేశవ్యాప్త అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా 4 కోట్లకుపైగా ఆరోగ్య కార్డులు జారీచేసింది. ఉచిత చికిత్స పొందడం కోసం లక్షలాది గిరిజన లబ్ధిదారులకు ఆయుష్మాన్ కార్డులు పంపిణీ చేసింది. జల్ జీవన్ మిషన్ కింద గిరిజన ప్రాంతాలు సహా దేశవ్యాప్తంగా ఇంటింటికీ సురక్షిత తాగునీరు సరఫరా చేస్తోంది" అని శ్రీ మోదీ విశదీకరించారు.

భవిష్యత్తు కార్యక్రమాల్లో భాగంగా రెండు కీలక ఘట్టాలను ప్రధానమంత్రి ప్రస్తావించారు. ఈ మేరకు ఒడిషా ఆవిర్భవించి, 2036 నాటికి వందేళ్లు పూర్తవుతాయని, 2047లో స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాలు మొదలవుతాయని గుర్తుచేశారు. "ఒడిషా, భారత్ ఆకాంక్షలు వేర్వేరు కాదు... బలమైన ఒడిషా, శక్తిమంతమైన భారత్‌కు అవి దోహదం చేస్తాయి" అని ఆయన వివరించారు. జ్ఞానం, యోగా సంప్రదాయాలతో ప్రగాఢంగా ముడిపడిన నేలగా ఒడిషాను అభివర్ణిస్తూ– ఈ నేపథ్యంలో జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిం చనుండటాన్ని శ్రీ మోదీ గుర్తు చేశారు. దేశం నలుమూలల నుంచి, ప్రపంచమంతటా గల భారత పౌరులు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అంతేగాక యోగాను ఒక జీవన విధానంగా అనుసరించాలని విజ్ఞప్తి చేశారు.

చివరగా– ఈ కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించడంపై ప్రధానమంత్రి శ్రీ మోదీ రాష్ట్ర ప్రజలకు అభినందనలు తెలిపారు.

ఈ కర్మభూమిని సందర్శించి, మయూర్‌భంజ్ ప్రజలతో మమేకమయ్యే అవకాశం కల్పించిన రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ముకు మరోసారి ధన్యవాదాలు చెబుతూ తన ప్రసంగం ముగించారు.

# లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం

కరీంనగర్, జూన్ 22: లోక్ అదాలత్‌ల ద్వారా సత్వర న్యాయం జరుగుతుందని, పెండింగ్ కేసుల పరిష్కారంతో సమయం, ధనం ఆదా అవుతాయని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ నెల 20న నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్ సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్లలో వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదై దర్యాప్తులో ఉన్న, అలాగే కోర్టు విచారణలో ఉన్న కేసులను పరిష్కరించినట్లు వెల్లడించారు.

ఈ సందర్భంగా ఐపీసీకి సంబంధించిన 637 కేసులు, ప్రత్యేక చట్టాలకు (ఎస్ఎల్ఎల్) సంబంధించిన 46 కేసులు పరిష్కరించబడ్డాయని తెలిపారు. అలాగే ఈ–పెట్టి కేసులు 3,097, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 2,809, విపత్తు నిర్వహణ చట్టానికి సంబంధించిన ఈ–పెట్టి కేసులు 2 కలిపి మొత్తం 6,545 కేసులు పరిష్కరించామని వివరించారు. సైబర్ నేరాలకు సంబంధించిన 83 కేసుల్లో బాధితులకు రూ.73,67,714 తిరిగి అందజేసినట్లు తెలిపారు. ఇందులో రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 76 సైబర్ కేసుల్లో బాధితులకు రూ.27,35,072, సీసీఎస్ పోలీస్ స్టేషన్ రామగుండంలో నమోదైన 7 కేసుల్లో బాధితులకు రూ.46,32,647 తిరిగి అందజేసినట్లు పేర్కొన్నారు.

లోక్ అదాలత్ ద్వారా పెట్టి కేసులు, ట్రాఫిక్, ఎక్సైజ్, డ్రంక్ అండ్ డ్రైవ్ తదితర స్వల్ప చట్టపరమైన కేసులు వేగంగా పరిష్కారమయ్యాయని తెలిపారు. పెండింగ్ కేసుల పరిష్కారంతో ప్రజలకు సమయం, ధనం ఆదా అయ్యాయని చెప్పారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కేసుల పరిష్కారానికి సహకరించారని, పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని సీపీ పేర్కొన్నారు.

గత 15 రోజులుగా కమిషనరేట్ అధికారులు, కోర్టు సిబ్బంది కేసుల్లోని పక్షాలను స్వయంగా కలిసి, రాజీ మార్గం ద్వారా లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం పొందవచ్చని అవగాహన కల్పించడంతో నిర్దేశించిన లక్ష్యానికి మించి కేసులు పరిష్కరించగలిగామని తెలిపారు. ప్రతిరోజూ పర్యవేక్షణ నిర్వహించిన అధికారులు, కృషి చేసిన సిబ్బందికి త్వరలో రివార్డులు అందజేస్తామని చెప్పారు. జాతీయ మెగా లోక్ అదాలత్ విజయవంతానికి సహకరించిన రెండు జోన్ల ప్రధాన న్యాయమూర్తులు, జిల్లా న్యాయ సేవా సంస్థలకు పోలీస్ శాఖ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు కోర్టు విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ లోక్ అదాలత్ విజయవంతానికి కృషి చేసిన అధికారులు, సిబ్బందిని పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు.

# దేవినేని నెహ్రూ ఆశయాల సాధనే లక్ష్యం..

## –జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నదే నెహ్రూతో నడిచిన వారందరి ఆకాంక్ష: అవినాష్

విజయవాడజూన్ 22: దేవినేని నెహ్రూ ఆశయాలను సాధించే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని మాజీ మంత్రి దేవినేని నెహ్రూ తనయుడు ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్ పేర్కొన్నారు. మాజీ మంత్రి దేవినేని నెహ్రూ జయంతి సందర్భంగా సోమవారం విజయవాడలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, దేవినేని అభిమానులు ఘనంగా నివాళులు అర్పించారు. నగరంలోని ఎగ్జిక్యూటివ్ క్లబ్ వద్ద ఉన్న దేవినేని నెహ్రూ విగ్రహానికి ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు, ఆయన తనయుడు దేవినేని అవినాష్ పూలమాల వేసి నివాళులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ నాయకులు కడియాల బుచ్చిబాబు, విజయవాడ నగర ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ, మాజీ డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, మాజీ



కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, నెహ్రూ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ.. దేవినేని నెహ్రూ ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఐదు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా పనిచేసి ప్రజలకు విశేష సేవలు అందించారని పేర్కొన్నారు. తూర్పు నియోజకవర్గంలోని కొండ ప్రాంతాలు, కృష్ణలంక, కరకట్ట ప్రాంతాల ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఆయన ఎప్పుడూ ముందుండేవారని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ హయాంలో నెహ్రూ నగరాభివృద్ధికి విశేషంగా కృషి చేశారని, ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఎవరిని అడిగినా ఆయన చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి చెబుతారని అన్నారు. నెహ్రూతో కలిసి పనిచేసిన ప్రతి ఒక్కరూ ఆయన నాయకత్వం, ప్రజాసేవా తత్వం గురించి ఇప్పటికీ గర్వంగా చెప్పుకుంటున్నారని పేర్కొన్నారు. నెహ్రూతో కలిసి ప్రయాణం చేసిన వారందరి కోరిక జగన్ మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడమేనని అవినాష్ అన్నారు. తనకు ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్ష పదవి బాధ్యతలు అప్పగించిన జగన్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటానని చెప్పారు.

రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం జగన్ మళ్లీ అధికారంలోకి రావాల్సిన అవస రం ఉందని అభిప్రాయపడ్డారు. దేవినేని నెహ్రూ ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ పేద ప్రజలకు అండగా నిలుస్తామని, ప్రజాసేవే తమ లక్ష్యమని అవినాష్ స్పష్టం చేశారు. కార్యక్రమం అనంతరం నాయకులు, కార్యకర్త లు నెహ్రూ సేవలను స్మరించు కుంటూ ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు.

# ఒడిషాలోని లఖన్‌పూర్‌లో 'భారత్ కోల్ గ్యాసిఫికేషన్ అండ్ కెమికల్స్ లిమిటెడ్' ఏర్పాటు చేసే 'కోల్ టు అమ్మోనియం నైట్రేట్' ప్రాజెక్టుల శంకుస్థాపన

న్యూ ఢిల్లీ, జూన్ 22:ఇంధన భద్రత, సాంకేతిక స్వావలంబన, దేశీయ బొగ్గు వనరుల సుస్థిర వినియోగం దృక్కోణంలో ఇవాళ ఒక చారిత్రక ఘట్టం నమోదైంది. ఈ మేరకు ఒడిషాలోని ఝార్సుగూడ జిల్లా లఖన్‌పూర్‌లో 'భారత్ కోల్ గ్యాసిఫికేషన్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (బీసీజీసీఎల్) ఏర్పాటు చేసే 'కోల్ టు అమోనియం నైట్రేట్' ప్రాజెక్ట్‌కు రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆన్‌లైన్ మాధ్యమం ద్వారా సంయుక్తంగా శంకుస్థాపన చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ శ్రీ కంభంపాటి హరిబాబు, ముఖ్యమంత్రి శ్రీ మోహన్ చరణ్ మాఝీ, కేంద్ర బొగ్గు-గనుల శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి, సహాయ మంత్రి శ్రీ సతీష్ చంద్ర దూబె సహా ఒడిషా ఉప ముఖ్యమంత్రులు శ్రీ కనక్ వర్ధన్ సింగ్ దేవ్, శ్రీమతి ప్రవతి పరిడా, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇతర ప్రముఖులు కూడా పాల్గొన్నారు.

లఖన్‌పూర్‌లోని ప్రాజెక్ట్ ప్రాంతంలో శ్రీ జి.కిషన్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ- ముందుగా ఝార్సుగూడ ప్రజలను అభినందించారు. కోల్ ఇండియా లిమిటెడ్, బీహెచ్‌ఈఎల్ మధ్య సంయుక్త భాగస్వామ్యంలో ఏర్పాటయ్యే ఈ పరిశ్రమ బొగ్గు శుద్ధిలో నవ శకానికి నాంది పలుకుతుందని ఆయన అన్నారు. స్వదేశీ బొగ్గు గ్యాసిఫికేషన్ సాంకేతికతను ఇది ప్రోత్సహిస్తుందని, సమృద్ధ దేశీయ బొగ్గు వనరులను విలువ ఆధారిత రసాయనాలుగా మార్చే సౌలభ్యం కల్పిస్తుందని పేర్కొన్నారు. అలాగే, ఈ ప్రాంతంలోని యువతకు గణనీయ స్థాయిలో ఉపాధి లభించడమే కాకుండా నైపుణ్యాభివృద్ధికి అవకాశాలు కల్పిస్తుందని చెప్పారు. మరోవైపు అనుబంధ పరిశ్రమలు, సేవల రంగం ద్వారా ప్రాంతీయ ఆర్థిక వృద్ధి పుంజుకుంటుందని తెలిపారు.

'బీసీజీసీఎల్' అనేది కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్), భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్‌ఈఎల్) మధ్య ఏర్పాటైన ఒక సంయుక్త భాగస్వామ్య కంపెనీ. ఇందులో 'సీఐఎల్' వాటా 51 శాతం కాగా, బీహెచ్ ఈఎల్ వాటా 49 శాతంగా ఉంటుంది. ఈ ప్రాజెక్టు కోసం కోల్ ఇండియా లిమిటెడ్ అనుబంధ సంస్థ 'మహానది కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్' (ఎంసీఎల్) ఒడిషాలోని ఝార్సుగూడ జిల్లా, లఖన్‌పూర్‌లోగల తన 350 ఎకరాల బొగ్గు నిక్షేపాల భూమిని ఇస్తోంది. ఇక్కడే 'బీసీజీసీఎల్ ప్రాజెక్టు నిర్మితమవుతుంది. దీంతోపాటు ఈ ప్రాజెక్టుకు అవసరమైన బొగ్గును 'ఐబి వ్యాలీ వాషరీ' నుంచి 0.79 'ఎంటీపై' మేర శుద్ధి చేసిన బొగ్గును, 1.19 'ఎంటీపై' వ్యర్థ బొగ్గును 'ఎంసీఎల్' సరఫరా చేస్తుంది.కేంద్ర ప్రభుత్వ 'జాతీయ బొగ్గు గ్యాసి ఫికేషన్ మిషన్'కు అనుగుణంగా దేశవ్యాప్త భవిష్యత్ బొగ్గు-రసాయనాల ప్రాజెక్టులకు ఇదొక నమూనా కాగలదని అంచనా. బొగ్గు గ్యాసిఫికేషన్ ద్వారా ఏటా సుమారు 0.66 మిలియన్ టన్నుల (ఎంటీపీఏ) టెక్నికల్ గ్రేడ్ అమ్మోనియం నైట్రేట్‌ను ఉత్పత్తి చేయడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. రసాయన ఉత్పత్తి కోసం దేశీయంగా రూపొందించిన 'ప్రెషరైజ్డ్ ఫ్లూయిడైజ్డ్ బెడ్ గ్యాసిఫికేషన్' (పీఎఫ్‌బీజీ) సాంకేతికతను వినియోగించుకునే భారత తొలి వాణిజ్య స్థాయి కార్యక్రమాలలో ఇదొకగా నిలుస్తుంది.

ఈ ప్రాజెక్టును ?25,000 కోట్లకు పైగా అంచనా వ్యయంతో సిద్ధం చేస్తుండగా, దీనికి ఒడిషా ప్రభుత్వ ఉన్నత స్థాయి ఆమోద ప్రాధికార సంస్థ (హెచ్ఎల్‌సీఏ) నుంచి ఏకగవాక్ష అనుమతులు లభించాయి. దీంతోపాటు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నుంచి ?1,350 కోట్ల మేర ఆర్థిక ప్రోత్సాహకాలు కూడా మంజూరయ్యాయి. తద్వారా దేశీయ బొగ్గు గ్యాసిఫికేషన్ సాంకేతికత వాణిజ్యీకరణకు ప్రధాన ప్రోత్సాహంగా నిలుస్తుంది.

ఈ మేరకు అన్ని కీలక చట్టబద్ధ, పర్యావరణ ఆమోదాలు, అనుమతుల సౌలభ్యం, ఆర్థిక సహాయం కూడా సమకూరడం సహా ఏకమొత్తంగా టర్న్‌కీ ఎగ్జిక్యూషన్ ప్యాకేజీల కేటాయింపుతో ఈ ప్రాజెక్టును 2029 సెప్టెంబరు నాటికి ప్రారంభించాలని లక్ష్యనిర్దేశం చేసుకున్నారు. స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో బొగ్గును అధిక విలువ గల రసాయన ఉత్పత్తులుగా మార్చడంలో భారత్ సామర్థ్యాన్ని చాటే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుగా ఇది రూపొందగలదని భావిస్తున్నారు.

## ఉపసర్పంచుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి..

### -కామారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర కాంత్ రెడ్డి



నిజామాబాద్, జూన్ 22:ఉప సర్పంచ్ ల సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కామారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర కాంత్ రెడ్డి చెప్పారు. మండలంలోని రామేశ్వర పల్లి గ్రామానికి చెందిన గొల్లపల్లి వినోద్ కుమార్ గౌడ్ ఇటీవల మండల ఉప సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులుగా నియమితులయ్యారు. ఆయనను చంద్రకాంత్ రెడ్డి శాలువాలతో సత్కరించి అభినందించారు.అనంతరం మాట్లాడుతూ.. ఎంతో నమ్మకంతో ఎన్నుకున్న ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండి సేవలు చేయాలని చెప్పారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తుందని గుర్తు చేశారు. అట్టి పథకాలను ప్రజలకు అందే విధంగా చూడవలసిన బాధ్యత ప్రజాప్రతిని ధులపై ఎంతైనా ఉందన్నారు. మండలం లో ఉన్న ఉప సర్పం చు లందరూ ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన సూచించా రు. కార్యక్రమంలో నాయకులు రాజు, శశి కుమార్ పంచాయతీ కార్యదర్శి శ్యామ్ ఉన్నారు.

## ఓటు ప్రజాస్వామ్య విలువలకు పునాది

అమరావతి, జూన్ 22: స్వచ్ఛమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా ప్రజాస్వామ్యానికి పునాదని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. నియోజకవర్గంలోని 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరి పేట బూత్ నెంబర్.4 నందు నిర్వహించిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ(సర్) కార్యక్రమంలో ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా బీఎల్ఓలు చేపడుతున్న ఇంటింటి ఓటరు వివరాల సేకరణ, ధృవీకరణ ప్రక్రియను ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు జాబితా అత్యంత కీలకమైనదని, ప్రతి అర్హత కలిగిన పౌరుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని అన్నారు. పేర్లు, చిరునామాలు, ఇతర వ్యక్తిగత వివరాలలో మార్పులు ఉంటే వెంటనే సవరించుకోవాలని, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారి వివరాలను బీఎల్ఓలకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కబీర్, ఎరుబోతు కనకారావు, కంచేటి నాగరాజు, డిడి నాయుడు, దేవర తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తులకు ఆహ్వానం

ఆదిలాబాద్, జూన్ 22:మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలో తాత్కాలిక ప్రాతిపదికన ఉపాధ్యాయ నియామకాలు చేపడుతున్నారు. ఈ మేరకు అర్హత కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రత్యేక అధికారి దీవ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఫిజిక్స్, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు బయోసైన్స్ బోధించేందుకు ఈ నియామకాలు నిర్వహించనున్నారు. పీజీ, బీఎడ్, టెట్ అర్హతలు కలిగిన మహిళా అభ్యర్థులు ఈ నెల 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలను సంప్రదించాలని కోరారు.

## ధర్మాన చెరువు సుందరీకరణ పనులకు మంత్రి కొల్లు రవీంద్ర శంకుస్థాపన



మచిలీపట్నం, జూన్ 22: ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం జిల్లా పరిషత్ సెంటర్లో ధర్మాన చెరువు సుందరీ కరణ పనులకు సోమవారం ఉదయం ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ రావు ,కూటమి నాయకులతో కలిసి మంత్రి రవీంద్ర శంకుస్థాపన చేశారు. 2.78 కోట్ల రూపాయలతో ఈ చెరువును అభివృద్ధి చేసేందుకు అమృత స్కీమ్ కింద నగరపాలక సంస్థ ముందుకొచ్చింది. ఈ పనులను మెగా ఇంజనీరింగ్ కంపెనీ చేపట్టింది.

ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. ఆంధ్ర ప్రదేశ్ ను ఆహ్లాదకంగా మార్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు. దానిలో భాగంగానే మచిలీపట్నంలో సుందరీకరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతుండగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాల కోసం ప్రణాళిక బద్ధంగా పనిచేస్తున్నామన్నారు ధర్మాన చెరువును అభివృద్ధి చేసి ఈ ప్రాంతాన్ని బందరు ఐకాన్ గా తీర్చిదిద్దుతామన్నారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి మధ్యలో డాల్ఫిన్ మౌంటైన్ ఏర్పాటు చేసి బందర్ లోనే అత్యంత ఆహ్లాదకరమైన ప్రదేశంగా ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దుతామన్నారు.

## నేడు కొత్తగూడెం రానున్న తన్నీరు హరీష్ రావు

ఖమ్మం, జూన్ 22: సింగరేణి పరిరక్షణ పేరుతో జరుగుతున్న ఉద్యమంలో భాగంగా ఈ నెల 23 వ తేదీన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు శాసనసభ పక్ష ఉప నేత హరీష్ రావు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యటించనున్నారు. ఆ పార్టీ అనుబంధ యూనియన్ టీబీజీకెఎస్ ఆధ్వర్యంలో స్థానిక కొత్తగూడెం క్లబ్ లో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం సింగరేణి సంస్థను తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటుంది అంటూ గులాబీ పార్టీ సింగరేణి పరిరక్షణ సమితి పేరుతో సంస్థ విస్తరించిన ఆరు జిల్లాల్లో పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడుతుంది. అందులో భాగంగా సింగరేణి హెడ్ ఆఫీస్ ఉన్న ప్రాంతంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు,కార్యకర్తలు, సింగరేణి కార్మికులు పాల్గొనాలని ఎంపీ వద్దిరాజు పిలుపునిచ్చారు.

## ఉపసర్పంచుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

### -ఎమ్మెల్యే బొజ్జు పటేల్



మహబూబ్‌నగర్, జూన్ 22:ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఉట్నూర్ మండల ఉపసర్పంచుల ఫోరం నూతన అధ్యక్షుడు, నాయకులు, ఉపసర్పంచులు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

అనంతరం ఉపసర్పంచులు తమకు ఎదురవుతున్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఉపసర్పంచుల చెక్‌పవర్‌కు సంబంధించిన వార్తలపై తమ ఆందోళనలను వివరించారు. ప్రభుత్వం తరఫున ఉపసర్పంచుల సమస్యల పరిష్కారానికి సహకరించాలని ఎమ్మెల్యేను కోరారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జు పటేల్ మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి అధికారులు, సర్పంచులు, ఉపసర్పంచులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అందరి ఐక్యతతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ఉపసర్పంచుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచుల ఫోరం జిల్లా ఇన్‌చార్జి మొహమ్మద్ మోబిన్, ఉట్నూర్ మండల ఉపసర్పంచుల ఫోరం నూతన అధ్యక్షుడు వెడ్మ కొద్దు పటేల్, వివిధ గ్రామపంచాయతీల ఉపసర్పంచులు, కాంగ్రెస్ నాయకుడు అన్సారీ అలీ తదితరులు పాల్గొన్నారు.

# జయశంకర్ సార్ ఆశయ సాధనే నిజమైన నివాళి..

### -హాజరైన మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు



వరంగల్, జూన్ 22: తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా అమెరికాలోని న్యూజెర్సీలో నిర్వహించిన సంస్మరణ సభకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హాజరై ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ భావజాల వ్యాప్తికి జయశంకర్ సార్ చేసిన విశేష కృషిని స్మరించుకున్నారు.

సభలో దయాకర్ రావు మాట్లాడుతూ, జయశంకర్ సార్ తనకు గురువులాంటి వారని, ఆయన స్ఫూర్తితోనే తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నానని తెలిపారు. తెలుగుదేశం పార్టీలో తెలంగాణ ఉద్యమానికి మద్దతు ఉండేలా మార్గనిర్దేశం చేసిన మహనీయుడు జయశంకర్ సార్ అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అనుకూలంగా చంద్రబాబునాయుడు లేఖ ఇవ్వడంలో తాను కీలక పాత్ర పోషించానని పేర్కొన్నారు.

తనతో పాటు 15 మంది ఎమ్మెల్యేలు తెలంగాణకు అనుకూలంగా సంతకాలు చేసినప్పటికీ, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం అప్పట్లో సంతకం చేయలేదని విమర్శించారు. తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో జయశంకర్ సార్ చేసిన కృషి మరువలేనిదని అన్నారు.

తెలంగాణ ప్రజలకు కీలక పదవులు దక్కని సమయంలో అసెంబ్లీలో తెలంగాణ హక్కుల కోసం పోరాడిన వ్యక్తిగా తాను నిలిచానని దయాకర్ రావు పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ సస్యశ్యామలం అయిందని, పింఛన్ల పెంపు, కల్యాణలక్ష్మి, రైతుబంధు వంటి సంక్షేమ పథకాల ద్వారా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చారని తెలిపారు.

రైతుబంధు వంటి పథకాల ద్వారా రైతులను ఆదుకున్న కేసీఆర్ పాలనతో పోలిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. రైతులకు తగిన మద్దతు అందించడం లేదని విమర్శిస్తూ, ప్రజలు తగిన సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని అన్నారు.

ఈ సంస్మరణ సభకు ఆహ్వానించి పాల్గొనే అవకాశం కల్పించిన నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జయశంకర్ సార్ వంటి మహనీయుడి సంస్మరణ సభలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు.

## నూతన పెట్రోల్ బంకును ప్రారంభించిన ఐజి కమలహాసన్ రెడ్డి



మహబూబ్‌నగర్, జూన్ 22: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాలకొండ బైపాస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన శక్తి ఫిల్లింగ్ స్టేషన్ (హెచ్‌పీ పెట్రోల్ బంక్)ను ఐజీ ఎఫ్ పోలీస్ కమలహాసన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా పెట్రోల్ బంక్ యజమాని పటేల్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఎదిర, పాలకొండ, హౌసింగ్ బోర్డ్, భూత్పూర్ ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు ఇంధనం కోసం మూడు నుంచి నాలుగు కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం ఈ పెట్రోల్ బంక్ అందుబాటులోకి రావడంతో స్థానిక ప్రజలు, వాహనదారులకు ఎంతో సౌలభ్యం కలుగుతుందని చెప్పారు. వాహనదారులకు నాణ్యమైన పెట్రోల్, డీజిల్‌ను అందించేందుకు కట్టుబడి ఉన్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన స్నేహితులు, బంధువులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## ఎంసెట్ అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రారంభం

వరంగల్, జూన్ 22:తెలంగాణ ఎంసెట్-2026లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల కోసం సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ ఆదివారం వనపర్తిలో ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రంలో స్లాట్ బుకింగ్ చేసుకున్న అభ్యర్థులకు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తున్నారు.

ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి వెరిఫికేషన్ కేంద్రానికి చేరుకుని రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పాల్గొన్నారు. అభ్యర్థులు తమ ర్యాంక్ కార్డు, హాల్ టికెట్, ఎస్ఎస్‌సీ మెమో, ఇంటర్మీడియట్ మార్కుల మెమోలు, స్టడీ సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, లోకల్ సర్టిఫికెట్ తదితర ఒరిజినల్ పత్రాలను సమర్పించి ధ్రువీకరణ చేయించుకున్నారు.

సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. అవసరమైన అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ ప్రతులను కూడా వెంట తీసుకురావాలని అభ్యర్థులకు సూచించారు. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిన అభ్యర్థులకు మాత్రమే తదుపరి కౌన్సెలింగ్ ప్రక్రియలో పాల్గొనే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

ఈ నెల 25వ తేదీ నుంచి వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ ప్రారంభం కానుండగా, విద్యార్థులు తమకు నచ్చిన కళాశాలలు, కోర్సులను ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుందని అధికారులు వెల్లడించారు. సాంకేతిక విద్యా మండలి విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

## నోటు పుస్తకాలు పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్యే సునీత



రంగారెడ్డి, జూన్ 22:యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులకు ఉచిత నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. జైన్ ట్రస్ట్ వారి శ్రీ అజిత్ పార్శ్వ యువ సంఘటన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ విప్, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునిత మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా జైన్ ట్రస్ట్ సభ్యులతో కలిసి ఆమె విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలను అందజేశారు. అనంతరం సునీత మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుకు నోట్ పుస్తకాలు, విద్యా సామగ్రి ఎంతో అవసరమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్న జైన్ ట్రస్ట్ ప్రతినిధులను ఆమె ప్రశంసించారు. విద్యార్థులంతా కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. జైన్ ట్రస్ట్ ప్రతినిధులు, శ్రీ అజిత్ పార్శ్వ యువ సంఘటన్ సభ్యులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# కథాంశాలు, సృజనాత్మకత, భవిష్యత్తుపై ఎంఐఎఫ్ఎఫ్ సదస్సులో యానిమేషన్ చిత్ర దర్శకుల విశ్లేషణ

న్యూ ఢిల్లీ, జూన్ 22:“ మీరు సముద్ర తీరానికి వెళ్లి గవ్వలు ఏరుకోవచ్చు, ఇసుక కోటలూ కట్టుకోవచ్చు, లేదా ఎవరైనా అక్కడ శాంతిని కూడా పొందవచ్చు. అదంతా మీరు ఆ అనుభవం నుంచి ఏం పొందుతున్నారనే దానిపైనే ఆధారపడి ఉంటుంది” అని ప్రముఖ చలనచిత్ర దర్శకురాలు ధ్వని దేశాయ్ వ్యాఖ్యానించారు. 19వ ముంబయి అంతర్జాతీయ చలన చిత్రోత్సవం 2026 లో కథనాలు, సృజనాత్మకత, ప్రేక్షకుల విశ్లేషణ అంశంపై జరిగిన ఆసక్తికరమైన చర్చా వేదికలో ఆమె ఈ విషయాలను పంచుకున్నారు. వివిధ సాంస్కృతిక, కళాత్మక నేపథ్యాల నుంచి వచ్చిన యానిమేషన్ చలనచిత్ర దర్శకులను ఒకచోటకు చేర్చిన ఈ సదస్సు.. ఆలోచనలు చిత్రాలుగా ఎలా రూపుదిద్దుకుంటాయి. ప్రేక్షకులు వాటి నుంచి అర్థాలను ఎలా గ్రహిస్తారనే అంశాలపై లోతుగా చర్చించింది.

ఒక ప్రసిద్ధ జెన్ బౌద్ధ కథను ఉదాహరణగా తీసుకుంటూ.... ప్రేక్షకులు సినిమాలను వేర్వేరు కోణాల్లో ఎలా అనుభూతి చెందుతారో ధ్వని దేశాయ్ వివరించారు. మీరు సముద్రానికి వెళ్లి గవ్వలు ఏరుకోవచ్చు, ఇసుక కోటలు కట్టుకోవచ్చు, కొందరు అక్కడ శాంతినీ పొందవచ్చు. అదంతా ఆ అనుభవం నుంచి మీరు ఏమి స్వీకరిస్తారనే దానిపై ఆధారపడి ఉంటుంది” అని ఆమె వ్యాఖ్యానించారు. సముద్రతీర ఉదాహరణ ద్వారా ఆమె ఒకే సినిమాను వేర్వేరు ప్రేక్షకులు ఎలా తమ సొంత ఆలోచనల ప్రకారం అర్థం చేసుకుంటారో స్పష్టం చేశారు.

యానిమేషన్ చలనచిత్ర దర్శకుడు రైముండ్ క్రుమ్మే కూడా ఇటువంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేశారు. ప్రేక్షకులు తన సినిమాలను తమదైన శైలిలో అర్థం చేసుకునే స్వేచ్ఛను కలిగి ఉండటాన్ని తాను ఎంతగానో ఆస్వాదిస్తానని చెప్పారు. “ప్రతి సంస్కృతికి ఒక సినిమాను అర్థం చేసుకునే సొంత విధానం ఉంటుంది. నాకు ఆ స్వేచ్ఛ నచ్చుతుంది”అని ఆయన పేర్కొన్నారు. ప్రేక్షకులను ఒకే ఒక నిర్దిష్ట అర్థం వైపు నడిపించడం కంటే.. విశ్వవ్యాప్తంగా అందరికీ అర్థమయ్యే భావోద్వేగాలు, అనుభవాల చుట్టూ తన కథలను నిర్మిస్తూ, వ్యక్తిగత విశ్లేషణలకు తగినంత అవకాశాన్ని ఇవ్వడానికే తాను ఇష్టపడతానని ఆయన తెలిపారు.

తన సృజనాత్మక ప్రక్రియ గురించిన ఆసక్తికర విషయాలను దర్శకుడు వెల్లడించారు. తన ఆలోచనలలో చాలా వరకు నేరుగా గోడలపై గీసే స్కెచ్‌లతోనే మొదలవుతాయని చెప్పారు. “నా ఆలోచనలు స్వేచ్ఛగా సాగడం కోసం నేను గోడలపై చిత్రాలను గీస్తాను” అని ఆయన అన్నారు. ఈ పెయింటింగ్‌లు తరచుగా ప్రదర్శనలు, సినిమాలు రెండింటికీ ప్రారంభ విషయంగా మారుతుంటాయని తెలిపారు. తన కళాత్మక సాధనలో చలనం అత్యంత కీలకమైన భాగమని తెలుపుతూ.. తన స్కెచ్‌లు చాలా వరకు శక్తినీ, లయనీ, చలనాన్నీ ప్రతిబింబించేలా రూపొందిస్తాయని పేర్కొన్నారు.

గడిచిన కొన్నేళ్లుగా యానిమేషన్ రంగంలో వచ్చిన మార్పుల గురించి కూడా ఈ చర్చలో విశ్లేషించారు. ఈ మాధ్యమం కాలక్రమేణా ఎంతో అభివృద్ధి చెందిందని, ప్రస్తుతం ఇదొక కళాత్మక వ్యక్తీకరణ రూపంగా మరింత ఎక్కువ గుర్తింపును పొందుతోందని ఇద్దరు దర్శకులు అంగీకరించారు. వేగంగా మారుతున్న ప్రస్తుత కాలంలో కృత్రిమ మేధ, ఇతర సరికొత్త సాంకేతికతల పెరుగుతున్న పాత్రను కూడా వారు ఈ వేదికగా గుర్తించారు.

నృత్యం చేసే జంట నేపథ్యంగా రూపొందించిన తన చిత్రం వెనుక ఉన్న లోతైన అర్థాన్ని దర్శకుడు రైముండ్ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఆ కథ ప్రయాణం చుట్టూ తిరిగినప్పటికీ, ఇది నిజానికి ప్రయాణంలో పొందే అద్భుతమైన అనుభూతికి సంబంధించినదని ఆయన చెప్పారు. “ప్రయాణం అంటే కేవలం ఒక చోటు నుంచి ఇంకొక చోటుకు వెళ్లడం మాత్రమే కాదు. అది మనసుకు ఎంతో ఉత్సాహాన్ని, ఆనందాన్ని ఇచ్చేదిగా ఉండాలి” అని పేర్కొంటూ.. ప్రయాణాలకు, జీవితంలోని విస్తృత అనుభవాలకు మధ్య ఉన్న సారూప్యతను ఆయన వివరించారు.

ఈ సదస్సు యానిమేషన్ చిత్ర దర్శకుల సృజనాత్మక ఆలోచనా విధానాన్ని ప్రేక్షకులకు ఎంతో ఆసక్తికరంగా పరిచయం చేసింది. వ్యక్తిగత అనుభవాలు, వినూత్న ఆలోచనలు, సరికొత్త సాంకేతికతలు వారు చెప్పే కథలపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతాయో ఈ వేదిక వివరించింది. యానిమేషన్ కేవలం తెరపై కదిలే బొమ్మలు మాత్రమే కాదని.. ప్రేక్షకులు తమ మనసుకు హత్తుకునేలా చేసి, సినిమా ముగిసిన తర్వాత కూడా చాలా కాలం పాటు గుర్తుంచుకునేలా ఒక అర్థవంతమైన అనుభూతిని సృష్టించడమే అసలైన యానిమేషన్ అని ఈ చర్చా కార్యక్రమం స్పష్టం చేసింది.

## బుద్ధ విహార్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

### -ఎమ్మెల్యేకు వినతి అందజేసిన ముఖ్రా బి గ్రామస్థులు




ఆదిలాబాద్, జూన్ 22:ఇచ్చొడ మండలంలోని ముఖ్రా బి గ్రామస్తులు సోమవారం రోజున ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మాణంలో ఉన్న బుద్ధ విహార్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నజీర్, ముఖ్రా కె మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

## సింగరేణిలో బొగ్గు రవాణా అత్యంత పారదర్శకం. ఆర్జీ-3

### – జీఎం మధుసూదన్, ఏపీ ఏజీఎం బండి సత్యనారాయణ




కరీంనగర్, జూన్ 22: సింగరేణి లో (ఎస్‌సీసీఎల్)లో బొగ్గు రవాణా వ్యవస్థ అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా కొనసాగుతోందని ఆర్‌జీ-3 జీఎం మధుసూదన్, ఏపీ ఏజీఎం బండి సత్యనారాయణ తెలిపారు. జీఎం కాన్ఫరెన్స్ హాల్ లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు బొగ్గు ఉత్పత్తి అయిన క్షణం నుంచి వినియోగదారునికి చేరే వరకు ప్రతీ దశను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల బొగ్గు మాయమైందని, భారీ స్థాయిలో చోరీలు జరుగుతున్నాయంటూ వస్తున్న ఆరోపణలు వాస్తవాలకు దూరమని సంస్థ స్పష్టం చేశారు.

బొగ్గు రవాణాలో జీపీఎస్, ఆర్ఎఫ్ఐడీ, సీసీటీవీ, జియో ఫెన్సింగ్, డిజిటల్ వెయిబ్రిడ్జ్‌లు వంటి ఆధునిక వ్యవస్థలు అమల్లో ఉండటంతో అక్రమాలకు అవకాశం లేదని వెల్లడించారు. సింగరేణిలో ఉత్పత్తి అయ్యే బొగ్గులో సుమారు 85 శాతం రైల్వే మార్గం ద్వారా, మిగిలిన 15 శాతం రోడ్డు మార్గం ద్వారా వినియోగదారులకు సరఫరా అవుతోందన్నారు. హైదరాబాద్‌లోని మార్కెటింగ్ విభాగం ద్వారా ఆంక్ష ఆధారిత వ్యవస్థలో బొగ్గు కేటాయింపులు జరుగుతాయని, ఏ వినియోగదారుడు ఎంత బొగ్గు ఎక్కడి నుంచి స్వీకరించాలో ముందుగానే డిజిటల్‌గా నమోదవుతుందని అధికారులు తెలిపారు.

రోడ్డు మార్గంలో రవాణా చేసే ప్రతీ వాహనం గని లేదా కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (సీహెచ్‌పీ) వద్ద ఎలక్ట్రానిక్ వెయిబ్రిడ్జ్‌పై తూకం వేస్తున్నామని, అనంతరం కంప్యూటర్ జనరేట్ చేసిన వే-బిల్ జారీ చేసిన తర్వాతే వాహనాలను విడుదల చేస్తారని పేర్కొన్నారు. జీపీఎస్, జియోఫెన్సింగ్ సాంకేతికతలతో వాహనాల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. బఅదేవిధంగా అన్ని వెయిబ్రిడ్జిలు కోల్‌నెట్ డిజిటల్ వ్యవస్థకు అనుసంధానమై ఉన్నాయని, లోడింగ్ సమయంలో నమోదయిన బరువును గమ్యస్థానంలో నమోదైన బరువుతో సరిపోల్చి పరిశీలిస్తారని వివరించారు. ఏదైనా వ్యత్యాసం గుర్తిస్తే వెంటనే విచారణ చేపడతారని తెలిపారు.

గనులు, వెయిబ్రిడ్జిలు, సీహెచ్‌పీలు, స్టాక్‌యార్డులు, ఎంట్రీ-ఎగ్జిట్ గేట్లు, రైల్వే సైడింగ్‌ల వద్ద సీసీటీవీ కెమెరాలు, ఆర్‌ఎఫ్‌ఐడీ ఆధారిత బూమ్ బ్యారియర్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

ఈ వ్యవస్థల ద్వారా బొగ్గు రవాణా ప్రక్రియ మొత్తం 24 గంటల పాటు పర్యవేక్షణలో ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో ఎస్వో జీఎం క్వాలిటీ రాం మోహన్, పర్సనల్ డీజీఎం సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## చిగురుమామిడిలో అభివృద్ధి పనులకు భూమి పూజ



కరీంనగర్, జూన్ 22: చిగురుమామిడి మండల కేంద్రం లో 12వ వార్డులో మురికి కాలువ నిర్మాణాలకు గాను సర్పంచ్ ఆకవరం భవాని సోమవారం వార్డు సభ్యులు, అధికారులతో కలిసి భూమి పూజ చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులచే మురికి కాలువ నిర్మాణ అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఈ సందర్భంగా సర్పంచ్ తెలిపారు.

గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ విజయలక్ష్మి, బీఆర్ఎస్ గ్రామ శాఖ మాజీ అధ్యక్షుడు ఆకవరం శివప్రసాద్, వార్డు సభ్యులు అనిల్, శ్రీనివాస్, అనిల్ కుమార్, అంజమ్మ, సమ్మయ్య, పంచాయతీ కార్యదర్శి కాల్వ రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అన్ని ఉత్త మాటలే

### -ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి




వరంగల్, జూన్ 22: రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్ని ఉత్త మాటలే చెబుతాడని, తెలంగాణ రాష్ట్రంలో రైతాంగం బతుకుతున్నారు అంటే అది కేవలం కేంద్ర ప్రభుత్వం వల్లేనని ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం భువనగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం యాభై ఐదు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం తెలంగాణ నుంచి కొనుగోలు చేసిందని, దేశంలో అన్ని రాష్ట్రాల కంటే తెలంగాణ నుంచి ఎక్కువగా 1/3 ధాన్యం కొనుగోలు కేంద్ర ప్రభుత్వం చేసిందన్నారు. రేవంత్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడానికి పరిమితమైందని, క్షేత్ర స్థాయిలో చేసింది శూన్యమన్నారు. వరంగల్ డిక్లరేషన్ ఎందుకు అమలు చేయడం లేదో రాష్ట్ర ప్రజలకు చెప్పాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్, నాయకులు పాశం భాస్కర్, పడమటి జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

## సీఎం విజయ్ బర్త్‌డే స్పెషల్..

### ఆ శిశువులకు బంగారు ఉంగరాల కానుక

తమిళనాడు, జూన్ 22: తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతున్న ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత దళపతి విజయ్ పుట్టినరోజు వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారు. అభిమానులు, పార్టీ శ్రేణులు భారీ ఎత్తున సేవా కార్యక్రమాలు, అన్నదానాలు, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ తమ అభిమాన నాయకుడి జన్మదినాన్ని ప్రత్యేకంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో భాగంగా తూత్తుకుడి జిల్లాలో చోటు చేసుకున్న ఓ వినూత్న కార్యక్రమం అందరి దృష్టిని ఆకర్షించింది. ముఖ్యమంత్రి విజయ్ పుట్టినరోజు నాడే జన్మించిన నవజాత శిశువులకు బంగారు ఉంగరాలను బహూకరించడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

జూన్ 22 ముఖ్యమంత్రి విజయ్ జన్మదినం రోజున తూత్తుకుడి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో మొత్తం ఆరుగురు శిశువులు జన్మించారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి శ్రీనాథ్ వెంటనే ఆసుపత్రికి చేరుకుని తల్లులు, శిశువుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి విజయ్ పుట్టినరోజు సందర్భంగా ఆ ఆరుగురు నవజాత శిశువులకు ప్రత్యేకంగా తయారు చేయించిన బంగారు ఉంగరాలను మంత్రి స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమం ఆసుపత్రి సిబ్బంది, స్థానిక ప్రజల ప్రశంసలు అందుకుంది.

తమ పిల్లలు ముఖ్యమంత్రి విజయ్ పుట్టినరోజు నాడే జన్మించడం, అదే సమయంలో ప్రభుత్వ మంత్రి చేతుల మీదుగా బంగారు కానుక అందుకోవడం పట్ల ఆయా కుటుంబాలు ఆనందం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రాంగణంలో అభిమానులు మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు.

## వచ్చే ఐదేళ్లు చిట్టినాయుడు అండ్ టీంకు సినిమా చూపెట్టే బాధ్యత నాది : కేటీఆర్



వరంగల్, జూన్ 22: వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్‌తో పాటు నియోజకవర్గానికి చెందిన నేతలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. వచ్చే ఐదేళ్లు ఏదీ మర్చిపోము. మనల్ని ఇబ్బంది పెట్టినోడిని మర్చిపోం.. మనమీద కేసులు పెట్టినోడిని మరిచిపోం. మనతో నిలబడినోళ్లను కూడా మరిచిపోమన్నారు.

తప్పకుండా చెప్తున్నా.. నేను కేసీఆర్ సారంతా మంచోణ్నైతే కాదు. వచ్చే ఐదేళ్లు చిట్టినాయుడుకు ఆయన బృందానికి సినిమా చూపెట్టే బాధ్యత నాది.. పక్కా విడిచిపెట్ట. రిటైరైనా పారిపోయినా సప్తసముద్రాల అవతల దాక్కున్నా.. ఎవడెవడైతే మా కార్యకర్తలను సతాయించిండో ఒక్కొక్కడిని వెతికి తెచ్చి మీ ముందట నిలబెట్టే బాధ్యత నాది.. వదిలిపెట్టే సమస్యే లేదన్నారు. ఇది నేనేం ఊరికే చెప్పడం లేదు.. గుర్తు పెట్టుకోండి. కానీ రమేశన్న (ఆరూరి రమేశ్) వీడు మంచోడేనే అన్నా అని మళ్లా వారిని తీసుకొని రావొద్దని కేటీఆర్ సూచించారు.

## చిత్తూరు జిల్లాలో తీవ్ర విషాదం.. ఒకే కుటుంబానికి చెందిన నలుగురి ఆత్మహత్య

అమరావతి, జూన్ 22: చిత్తూరు జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు కుటుంబ సభ్యులు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ విషాదకర సంఘటన చిత్తూరు రూరల్ మండలం బంగారెడ్డిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో మరణించిన వారిని ఒకే కుటుంబానికి చెందిన దామోదర్ (కుటుంబ యజమాని), నిర్మల (భార్య), దిలీప్ (కుమారుడు), శ్రీవిద్య కుమార్తెగా పోలీసులు గుర్తించారు. దామెదర్ భార్య నిర్మల కొంతకాలంగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. దీంతో జీవితంపై విరక్తి చెందిన దామెదర్ తనువు చాలించాలని నిర్ణయించుకున్నాడు.

ఈ క్రమంలోనే ఆయన మొదట తన భార్యకు, ఇద్దరు పిల్లలకు విషం ఇచ్చాడు. ఆ తర్వాత తాను కూడా ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తమ చావుకు ఎవరూ కారణం కాదని సుసైడ్ లెటర్‌లో స్పష్టం చేశాడు. అంతేకాకుండా, తన ఏటీఎం కార్డులో డబ్బులు ఉన్నాయని, ఆ డబ్బును డ్రా చేసి తమ కుటుంబ సభ్యుల అంత్యక్రియల ఖర్చులకు ఉపయోగించాలని ఆ లేఖలో కోరడం అందరినీ కలిచివేసింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

## ఎన్బీడబ్ల్యూ ముద్దాయిలపై పోలీసుల ఉక్కుపాదం

### –జిల్లా జైలుకు తరలింపు



అమరావతి, జూన్ 22: కోర్టు విచారణలకు హాజరుకాకుండా పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్ల (ఎన్బీడబ్ల్యూ) అమలుపై కదిరి టౌన్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఇద్దరు ముద్దాయిలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి ఆదేశాల మేరకు అనంతపురం జిల్లా జైలుకు తరలించారు.

కదిరి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులకు సంబంధించి కోర్టు వాయిదాలకు హాజరుకాని సుమారు 50 మంది ముద్దాయిలపై నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు ఈ వారెంట్ల అమలుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

ఈ క్రమంలో కదిరి టౌన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన 498(ం), 323, 506 ఐపీసీ సెక్షన్ల కేసులో ముద్దాయిలుగా ఉన్న రాయచోటి పట్టణానికి చెందిన పూలంగిరి హసీనా, షేక్ గులాబ్ జావ్ కొంతకాలంగా కోర్టు విచారణలకు హాజరు కాకపోవడంతో వారిపై జారీ అయిన ఎన్బీడబ్ల్యూలను అమలు చేశారు. ఇద్దరినీ అరెస్టు చేసి సంబంధిత కోర్టులో హాజరుపరచగా, విచారణ అనంతరం న్యాయమూర్తి రిమాండ్ విధించారు. దీంతో వారిని అనంతపురం జిల్లా జైలుకు తరలించారు.

ఇప్పటికే నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ అయిన ముద్దాయిలు మరో రెండు మూడు రోజుల్లోగా స్వచ్ఛందంగా సంబంధిత కోర్టుల్లో హాజరు కావాలని పోలీసులు సూచించా రు. లేనిపక్షంలో వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచడంతో పాటు కోర్టు ఆదేశాల మేరకు జైలుకు తరలిస్తామని హెచ్చరించారు.

# క్రీడల ద్వారా సమాజ వికాసం...ఒలింపిక్ దినోత్సవ సందేశం

అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 23న ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటారు. ఇది క్రీడల ప్రాముఖ్యతను, శారీరక శ్రమ విలువను, ఒలింపిక్ ఉద్యమ ఆదర్శాలను ప్రపంచ ప్రజలకు గుర్తు చేసే అవకాశంగా నిలుస్తుంది. 1894లో ఫ్రాన్స్‌కు చెందిన విద్యావేత్త పియర్ డి కుబెర్టిన్ ఆధ్వర్యంలో ప్యారిస్‌లో జరిగిన సదస్సులో ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ (IOC) ఏర్పాటు చేయబడింది. అదే చారిత్రాత్మక రోజును గుర్తిస్తూ 1948లో మొదటిసారిగా అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం జరుపబడింది. అప్పటి నుండి ఈ దినం ప్రపంచ దేశాలలోని కోట్లాది మందిని క్రీడా కార్యకలాపాల్లో పాల్గొనడానికి ప్రేరేపిస్తోంది.

ఈ దినోత్సవం మూడు ప్రధాన లక్ష్యాలను ప్రతిపాదిస్తుంది - శారీరక చురుకుదనం (Move), క్రీడలపై అవగాహన పెంపొందించుకోవడం (Learn), కొత్త క్రీడల అన్వేషణ (Discover).. ఒలింపిక్ విలువలైన శ్రేష్ఠత (Excellence), స్నేహం (Friendship) గౌరవం (Respect) అనే మూడు సూత్రాల ప్రచారం ఈ దినోత్సవ ప్రాథమిక ఉద్దేశం. ప్రపంచ వ్యాప్తంగా జాతీయ ఒలింపిక్ సంఘాలు, విద్యా సంస్థలు, క్రీడా సంస్థలు, ప్రభుత్వాలు మ్యూచువల్ భాగస్వామ్యంతో ఈ దినోత్సవాన్ని జరుపుతుంటాయి. రన్నింగ్, సైక్లింగ్, యోగా, ఫిట్‌నెస్ క్యాంపులు, క్రీడా పోటీలు, చర్చా సభలు, ఒలింపిక్ చరిత్ర ప్రదర్శనలు వంటి కార్యక్రమాలు నిర్వహించబడతాయి. అలాగే సోషల్ మీడియాలో Olympic Day వంటి ప్రచార హ్యాష్‌ట్యాగ్‌ల ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు ప్రయత్నిస్తారు.

ఒలింపిక్ క్రీడలు కేవలం గెలుపు ఓటముల కోసం కాదు, మానవతా విలువల ఆవిష్కరణకు మార్గం. వివిధ దేశాల మధ్య స్నేహ బంధం, సంస్కృతుల పరస్పర గౌరవం, శాంతియుత పోటీ భావన, వ్యక్తిగత ప్రతిభకు సామూహిక బాధ్యత కలగలిపే మహోన్నత భావాలు ఒలింపిక్ తత్వంలో నిగూఢంగా ఉన్నాయి. ఇది క్రీడల ద్వారా మానవ సమాజాన్ని ఐక్యంగా, ఆరోగ్యంగా, చైతన్యవంతంగా తీర్చిదిద్దే సందేశాన్ని అందిస్తుంది.




## జూన్ 23...అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం

భారతదేశం ఒలింపిక్స్‌లో తొలి అడుగు 1900లో పారిస్ గేమ్స్‌లో వేసింది. నోర్మన్ ప్రిట్చర్డ్ రెండు వెండి పతకాలు సాధించి తొలి ఒలింపిక్ విజేతగా నిలిచారు. 1928 నుండి 1956 వరకు భారత హాకీ జట్టు వరుసగా బంగారు పతకాలు సాధించి ప్రపంచ క్రీడా రంగంలో భారత ప్రతిష్టను పెంచింది. లెజెండరీ ప్లేయర్ మేజర్ ధ్యాన్ చంద్ హాకీకి పెట్టిన పునాది చరిత్రలో నిలిచి పోయింది. 2000 సిడ్నీ ఒలింపిక్స్‌లో కర్ణం మల్లేశ్వరి వెయిట్ లిఫ్టింగ్‌లో కాంస్యం సాధించి ఒలింపిక్స్‌లో పతకం గెలిచిన తొలి భారత మహిళగా గుర్తింపు పొందారు. అభినవ్ బింద్రా 2008 బెయ్జింగ్ ఒలింపిక్స్‌లో 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో బంగారు పతకం సాధించి వ్యక్తిగత స్వర్ణ పతకం గెలిచిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించారు.

టోక్యో 2020 ఒలింపిక్స్ (2021లో నిర్వహించబడింది) భారత ఒలింపిక్ చరిత్రలో అత్యుత్తమ ఫలితాలను తెచ్చింది. నీరజ్ చోప్రా జావెలిన్ త్రోలో స్వర్ణ పతకం సాధించి దేశ గౌరవాన్ని మెరుగుపరచగా, మీరాబాయి చాను వెయిట్ లిఫ్టింగ్‌లో రజత పతకంతో అదిరిపోయిన ఆరంభాన్ని ఇచ్చారు. లవ్లినా బోర్గోహైన్ బాక్సింగ్‌లో కాంస్యాన్ని, పురుషుల హాకీ జట్టు 41 ఏళ్ల విరామం తర్వాత కాంస్యాన్ని దేశానికి తీసుకు వచ్చాయి. పీవీ సింధు వరుసగా రెండో ఒలింపిక్స్‌లో పతకం సాధించిన భారత మహిళగా గుర్తింపు పొందారు.

2024 వరకూ భారత్ ఒలింపిక్స్‌లో మొత్తం 35 పతకాలు గెలుచుకుంది. వీటిలో 10 బంగారు, 9 వెండి, 16 కాంస్య పతకాలు ఉన్నాయి. ఇందులో హాకీ బృంద విజయాలు కూడా గణనలోకి వస్తాయి. ఒలింపిక్స్‌లో భారత్ సాధించిన ప్రతి పతకం క్రీడా పటిష్టతను పెంచడమే కాక, దేశంలోని యువతలో చైతన్యాన్ని రేకెత్తించింది. ఒలింపిక్స్ ద్వారా దేశం, తాను కేవలం ఆర్థికంగా కాదు .. ఆటలతో కూడా ప్రపంచానికి గౌరవనీయ స్థానం కలిగి ఉందని నిరూపించుకుంది.

అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం కేవలం ఒక రోజు వేడుక మాత్రమే కాదు, అది క్రీడల ద్వారా వ్యక్తిత్వ వికాసానికి, సమాజాభివృద్ధికి మార్గదర్శకంగా నిలిచే స్ఫూర్తి దాయక రోజు. మానవ శరీరాన్ని దృఢంగా, మనస్సును సమతుల్యంగా, సమాజాన్ని ఐక్యంగా తీర్చిదిద్దే క్రీడా సంస్కృతికి ఇదే మూలం. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరు క్రీడలను జీవితంలో భాగంగా చేసుకొని, ఒలింపిక్ ఆదర్శాల పరిరక్షణకు తాము కూడా ఒక భాగమవ్వాలని సంకల్పించాలి.



–రామ కిష్టయ్య సంగన భట్ల,
9440595494

# ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలి..

## – ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజనీకాంత్




రాజన్న సిరిసిల్ల, జూన్ 22: (నేటినిజం ప్రతినిధి): ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టేందుకు ప్రత్యేక ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు శనిగారపు రజనీకాంత్ డిమాండ్ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు శనిగారపు రజనీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఇప్పటికీ యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పూర్తిస్థాయిలో అందలేదని విమర్శించారు. మధ్యాహ్న భోజన పథకానికి తగిన నిధులు కేటాయించి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని కోరారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా మార్చాయని ఆరోపించిన ఆయన, ఫీజుల నియంత్రణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలను మూసివేయకుండా కొత్త పాఠశాలలను ఏర్పాటు చేసి విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. ధర్నా అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్‌తో పాటు పలువురు విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

# ఆటోను ఢీకొట్టిన గ్రానైట్ లారీ.. ముగ్గురు మృతి



అమరావతి, జూన్ 22:ప్రకాశం జిల్లా సంతమాగులూరు మండలంలో ఇవాళ ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కామేపల్లి సమీపంలో ఆటోను గ్రానైట్ లారీ ఢీకొట్టడంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, మరో ఏడుగురు గాయపడ్డారు. ఈ ఘటనతో బాధిత కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

పోలీసుల వివరాల ప్రకారం.. శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామానికి చెందిన 10మంది నాదెండ్ల మండలం సంకురాత్రిపాడులో జరిగే దశదిన కర్మ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఆటోలో బయల్దేరారు. కామేపల్లి రైల్వే అండర్‌పాస్ సమీపానికి చేరుకున్న సమయంలో గ్రానైట్ లోడ్‌తో వస్తున్న లారీ మలుపు తిరుగుతూ ఆటోను బలంగా ఢీకొట్టింది.

ప్రమాద తీవ్రతకు ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుకొండలు (60), రమణమ్మ (50) అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన వారిని స్థానికులు, పోలీసులు వెంటనే సమీప ఆస్పత్రులకు తరలించారు. అయితే చికిత్స పొందుతూ సుబ్బాయమ్మ (70) కూడా మృతి చెందడంతో మృతుల సంఖ్య మూడుకు చేరింది.

మరో ఏడుగురు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.




# మూడు నెలలుగా సమావేశం నిర్వహించడం లేదని బోధన్‌లో మున్సిపల్ కౌన్సిలర్ల నిరసన

నిజామాబాద్, జూన్ 22:బోధన్ పట్టణంలోని మున్సిపల్ పాలకవర్గం ఏర్పాటై ముడు నెలలు గడుస్తున్నా సమావేశం నిర్వహించడం లేదని బోధన్ మున్సిపాలిటీలో మున్సిపల్ కౌన్సిలర్లు సోమవారం వినూత్న నిరసన చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ వైస్ చైర్మన్ మీర్ ఇలియాజ్ అలీ ఆధ్వర్యంలో ఎంఐఎం కౌన్సిలర్లు కార్యాలయం ఆవరణలో టెంట్ వేసి కుర్చీలలో కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ మున్సిపల్ పాలక వర్గం ఏర్పాటై మూడునెలలు పూర్తయినా నెలవారీ సమావేశాలు నిర్వహించడం లేదని మండిపడ్డారు. అంతేకాకుండా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తే వారు కూడా స్పందించడం లేదని ఆరోపించారు. ఈ విషయంలో మున్సిపల్ కమిషనర్‌కు పలుమార్లు విన్నవించామని ఆయన స్పందించకపోవడంతో సమస్యలు ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ లో సమావేశలు నిర్వహించని కారణంగానా తామే కార్యాలయం ఆవరణలో టెంట్, కుర్చీలు వేసి అధికారులను ఆహ్వానించామన్నారు. అధికారులు ఇక్కడకు కూడా రాక పోవడంతో తమ సమస్యలతో కూడిన వినతిపత్రం ఖాళీ కుర్చీకి అందచేసి నిరసన వ్యక్తం చేశారు. అధికారుల వైఫల్యం కారణంగా సమస్యల పరిష్కారం లో వార్డుల్లో ప్రజలకు ఏం చెప్పాలో తెలియక వార్డుల్లో తిరగడం కూడా మానివేశామని కౌన్సిలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మున్సిపల్ సమావేశాలు నిర్వహించాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు హెచ్చరించారు.

# బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ రాజీనామా

న్యూఢిల్లీ, జూన్ 22: బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మం రాజీనామా చేశారు. లేబర్ పార్టీ నేతగా కూడా రిజైన్ చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అయితే తమ పార్టీకి కొత్త నేతను ఎంపిక చేసే వరకు తాత్కాలికగా ప్రధానిగా స్టార్మర్ కొనసాగనున్నారు.

మరికొన్ని వారాల్లో కొత్త నేతను ఎన్నుకోనున్నారు. 2024లో ఆయన నేతృత్వంలో లేబర్ పార్టీ ఎన్నికల్లో విజయం సాధించింది. కానీ రెండేళ్లలోనే ఆయనతో పాటు పార్టీ పాపులారిటీ కూడా తగ్గిపోయింది. గత వారం జరిగిన ఎన్నికల్లో ఆండీ బర్న్‌హమ్ .. ప్రత్యేక ఎన్నికల్లో గెలిచారు. గ్రేటర్ మాంచెస్టర్ మాజీ మేయర్ అయిన ఆయన. లేబర్ పార్టీ నాయకత్వ పాత్రకు పోటీపడనున్నారు.

రెండేళ్ల క్రితం డౌనింగ్ స్ట్రీట్‌లోకి ఎంట్రీ ఇవ్వడం జీవితంలో గర్వించదగ్గ సందర్భం అని తెలిపారు. ప్రజల జీవితాలను మెరుగుపరుచాలన్న ఉద్దేశంతో రాజకీయాల్లోకి ప్రవేశించినట్లు ఆయన చెప్పారు. దేశ ఆర్థిక, రక్షణ వ్యవస్థను పునరుత్తేజం చేసినట్లు స్టార్మర్ తెలిపారు. రాజకీయంగా, ఆర్థికంగా, నైతికంగా దివాళా తీసిన లేబర్ పార్టీకి జీవం పోశానన్నారు. పార్టీ పని అయిపోయిందన్న వారికి.. ఆ వ్యాఖ్యలు తప్పు అని నిరూపించారన్నారు.

# పల్లెల్లో నకిలీ విత్తనాలు.. అరికట్టేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు

## –ఇటీవల సిర్పూర్(యూ)లో 5.45 క్వింటాళ్ల పట్టివేత



ఆదిలాబాద్, జూన్ 22:పల్లెల్లో నకిలీ విత్తనాల దందా మొదలైంది. అమాయక రైతులకు వాటిని అంటగట్టి అందినకాడికి దండుకునే ప్రయ త్నం కొనసాగుతున్నది. పేరు..ఊరు లేని కంపెనీల్లో తయారైన విత్తనాల ప్యాకెట్లను విక్రయించేందుకు వ్యాపారులు సిద్ధమైనట్లు తెలుస్తున్నది. ఇటీవల సిర్పూర్–యూలో పోలీసులు చేపట్టిన తనిఖీల్లో 5.45 క్వింటాళ్ల పత్తి విత్తనాలు పట్టుబడడం ఇందుకు బలం చేకూరుతున్నది.

వివిధ రకాల కంపెనీల పేర్లతో నకిలీ విత్తనాలు అమాయక రైతులకు అంటగడుతున్న ముఠాలను అరికట్టేందుకు అధికారులు చర్య లు చేపడుతున్నారు. జిల్లాలో ఎరువులు, విత్తనాలు అమ్మేందుకు లైసెన్స్‌లు పొందిన డీలర్లు 251 మంది ఉన్నారు. వీరు తమ దు కాణాల ద్వారా విత్తనాలు, ఎరువులు అమ్ముతున్నారు. పట్టుబడుతున్న నకిలీ విత్తనాలను లైసెన్స్ పొందిన వారే తెప్పిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. వివిధ కంపెనీల పేరిట విత్తనాలు విక్రయిస్తున్న ముఠాలను అరికట్టేందుకు చ ర్యలు చేపడుతున్నారు. ప్రత్యేకంగా టాస్క్‌ఫో ర్స్ బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నారు.

మండలాలతో ఏమాత్రం సం బంధం లేని అధికారుల బృందాలు దుకాణా ల్లో తనిఖీ చేస్తున్నాయి. ప్రతి ఎరువుల దుకాణాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. జిల్లాలోకి నకిలీ విత్తనాలు ఎలా వస్తున్నాయి..? వాటి వెనుక ఎవరెవరు ఉన్నారనే విషయాలపై ఆ రా తీస్తున్నారు. ఇటీవల కలెక్టర్ హరిత కూ డా పలు ఫర్టిలైజర్స్ దుకాణాలును తనిఖీ చే సి, రికార్డులను పరిశీలించారు. ఆంధ్రలోని కర్నూల్, గుంటూరు, మహారాష్ట్రలోని పలు జిల్లాల నుంచి వివిధ మార్గాల ద్వారా కొరియర్ ద్వారా నకిలీ విత్తనాలు జిల్లాలోకి వస్తున్నట్లు తెలుస్తున్నది. ఇప్పటికే జిల్లాల నకిలీ విత్తనాలు పట్టుబడుతున్న ఘటనలు అనేకం ఉన్నాయి.

# బీటీ రోడ్డు విస్తరణ పనులు తక్షణమే చేపట్టాలి

## –జాతీయ రహదారిపై ధర్నా

ఆదిలాబాద్, జూన్ 22:నారాయణపేట జిల్లాఊట్కూర్ మండల పరిధిలోని పెద్ద జట్రం, బిజ్వార్, నుండి మక్తల్ మండలంలోనిజక్లేర్ వరకు ఉన్న ప్రధాన రహదారి పనులను, తక్షణవే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ (ఎంఎల్) కిలోమీటర్ల ఆర్ అండ్ బి రోడ్డును బీటీ డబుల్ గా మార్చాలని తక్షణమే పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో




మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. పెద్ద జట్రం నుండి జక్లేర్ వరకు గల 18 పెద్ద జట్రం గ్రామపంచాయతీ సెంటర్ నుండి బైక్ ర్యాలీని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. కృష్ణ ప్రారంభించారు.

ఈ రోడ్డును డబుల్ లైన్ గా మార్చితే ప్రజలకు అన్ని విధాల రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని అన్నారు. రోడ్డు బాగుంటే వాహనం బాగుంటుంది వాహనం బాగా వెళితే ప్రమాదాలు తగ్గుతాయని పేర్కొన్నారు.

తక్షణమే బీటీడబుల్ రహదారీ విస్తరణ పనులు చేపట్టి ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళన ఉధృతంగా చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మెండోరా రామాలయంలో ప్రత్యేక పూజలు..

భీమ్‌గల్ జూన్ 22: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రధానిగా 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం భీమ్‌గల్ మండలం మెండోరా గ్రామంలోని శ్రీ సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలకు బీజేపీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు అరె రవీందర్ మాట్లాడుతూ, రామరాజ్య పరిపాలన గురించి రామాయణంలో చదివామని, పెద్దల ద్వారా విన్నామని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ఆ ఆదర్శాలను ప్రతిబింబించే విధమైన పాలనను చూస్తోందని ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు.

దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ప్రధాని మోదీ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీ సీతారామచంద్రస్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. భారతదేశ ప్రతిష్ఠను ప్రపంచ వేదికపై మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే దిశగా మోదీ మరెన్నో సంవత్సరాలు దేశానికి సేవలందించాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకుడు నాగార్జున్ రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు ఎర్రోల్ల గంగాధర్, కిసాన్ మోర్చా మండల ఉపాధ్యక్షుడు తక్కూరి అంజయ్య, శక్తి కేంద్ర ఇన్‌చార్జి గాడి వేణు, సీనియర్ నాయకులు పార్వతి శ్రీనివాస్, ఏశాల గంగాధర్, వాల్గోట్ బాబూరావు, సంగెపు గంగాధర్, లింబాద్రి గౌడ్, రాంచందర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, సిలివేరి రమణాచారి, మెంగ నర్సయ్య, ఏశాల హన్మాండ్లు, జాగీర్యాల శ్రీకాంత్, కల్లెడ రాజేశ్వర్, కంఠం గంగా ప్రశాంత్, రోడ్డోళ్ల ఆంజి, రాజేశ్వర్, పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.